విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

శనివారం 09 ఆగస్టు 2025 8 పేజీలు

విద్యుత్ స్మార్ట్ మీటర్లతో రగడ



- ఇప్పటికే ప్రభుత్వ, వాణిజ్య సంస్థలకు ఏర్పాటు
- ఏడాదికే ప్రజల నెత్తిన 30వేల కోట్ల భారం
- సర్దుబాటు ఛార్జీల పేరిట 15485 కోట్ల బాదుడు
- 2019-24 మధ్యలో వాడిన విద్యుత్తుపైనా 12717 కోట్లు మోపేందుకు రంగం సిద్ధం
- తమకేమీ తెలియదంటున్న విద్యుత్ శాఖ అధికార యంత్రాంగం
- మరో విద్యుత్ ఉద్యమానికి తెరలేపిన వామపక్షాలు, ప్రజాసంఘాలు

విశాలాంధ్ర - సంతమాగులూరు :

కూటమి ప్రభుత్వం సామాన్యులకు స్మార్ట్ షాక్ ఇచ్చేందుకు రంగం సిద్ధం చేస్తోంది. చాపకింద నీరులా గత రెండు నెలలుగా ప్రభుత్వ కార్యాలయాలకు, ప్రైవేటు వాణిజ్య సంస్థలకు విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగిస్తూ వస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఇళ్లలోనూ మీటర్లు మార్చేందుకు పావులు కదుపుతున్నారు. అయితే ఇటీవల కాలంలో ప్రజల నుంచి వ్యతిరేకత రావడం, వామపక్షాలు,ప్రజాసంఘాలు ఆందోళనలు చేపట్టడంతో కొంతమేర వెనక్కి తగ్గినట్లు కనిపిస్తుంది. అంతకంటే ముందు తూర్పు గోదావరి, కాకినాడలో, అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లోనూ స్మార్ట్ మీటర్లు బిగించినట్లు సమాచారం. కూటమి అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి విద్యుత్ బిల్లులు పెంచం, పెంచబోమని, పెంచేదిలేదని చెబుతూ వస్తున్నారు. ఇక స్మార్ట్ మీటర్లు విషయానికి వచ్చేసరికి వాటిని గృహాలకు బిగించబోమని ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చారు. దీనికితోడు విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తామని తియ్యటి కబుర్లు చెప్పుకుంటూ వచ్చారు. అవేవీ అమలు జరగకపోగా, నాడు వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ విద్యుత్ బిల్లులపై తలపెట్టిన బాదుడే బాదుడును నేడు అధికారంలో ఉన్న కూటమి కూడా అదే పంథాలో నడవడం విడ్డూరంగా ఉందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు సర్దుబాటు పేరుతో అదనపు ఛార్జీలు వేస్తోంది. ట్రూఅప్ పేరుతో ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.మూలిగే నక్కపై తాటికాయ పడిన చందంగా స్మార్ట్ మీటర్ల బిగించడం అనివార్యంగా మారనుంది.

సామాన్య ప్రజలకు వడ్డన తప్పదా :
రోజుకు నాలుగైదుసార్లు

- మిగతా 2 లో

డెంగ్యూపై అధికారులు దండ్రయాత్ర

- డెంగ్యూను ఎదుర్కొనేందుకు యంత్రాంగం సిద్ధం
- ప్రతి గ్రామంలో ఫాగింగ్
- జ్వరం వస్తే వెంటనే ఆసుపత్రికి వెళ్లాలి
- అధికారులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలి
- కలెక్టర్ జె.వెంకటమురళి

విశాలాంధ్ర - బాపట్ల : జిల్లాలో డెంగ్యూ సీజనల్ వ్యాధులు ప్రభలుతున్న నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం దండయాత్ర ప్రకటించింది. గత కొన్ని రోజులుగా సీజనల్ వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో బాపట్ల జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. శుక్రవారం జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి జిల్లా మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి నిర్వహణ చర్యలను సమీక్షించారు. ఇప్పటివరకు జిల్లాలో

- మిగతా 2 లో

గిరిజన బాలికపై దాడి

మహిళల ముందు బహిరంగ మూత్ర విసర్జన

8 లో..

మున్సిపాలిటీలో మార్పులకు శ్రీకారం

- ప్రజలకు మేలు జరిగేలా చర్యలు
- కమిషనర్ ఇ.వి రమణబాబు

విశాలాంధ్ర - గిద్దలూరు :

పురపాలక సంఘ కార్యాలయంలో వివిధ విభాగాల్లో పనిచేసే సిబ్బంది ప్రక్షాళన దిశగా నూతన కమిషనర్ ఇ.వి రమణబాబు అడుగులు వేస్తున్నారు. పనికి డుమ్మా కొట్టి తిరుగుతున్న సిబ్బందిపై చర్యలకు శ్రీకారం చుట్టడమేకాక, తమ విధులు మరచి ఇతర విభాగాలలో తామే అధికారిలాగా పెత్తనం చలాయిస్తున్న కొంతమంది ఒప్పంద కార్మికులపై కొరడా ఝుళిపించారు. అందులో భాగంగా ఇంజినీరింగ్ విభాగంలో ఒక ఒప్పంద ఉద్యోగి తన విధులు మరచి అనధికార అసిస్టెంట్ ఇంజనీర్‌గా చలామణి అవుతుండగా అతనిపై చర్యలు చేపట్టిన కమిషనర్ అతనిని తిరిగి తన స్థానానికి బదిలీ చేసి అక్కడ తన విధులు నిర్వర్తించేలా చర్యలు తీసుకున్నారు. ఇంజినీరింగ్ విభాగమే కాక మరియొక విభాగంలో ఇంఛార్జిగా పనిచేస్తున్న సచివాలయ సిబ్బందిపై కూడా వేటు తప్పేలా లేదని కార్యాలయ సిబ్బంది చర్చించుకుంటున్నారు. అలాగే కొంతమంది సిబ్బంది హాజరు వేసికొని విధులకు డుమ్మా కొడుతున్న వారికీ కూడా చర్యలు తప్పవు అని హెచ్చరించినట్లు సమాచారం. అలాగే కొన్ని విభాగాలలలో నిర్లక్ష్యంగా, అవీనీతిమయంగా మారిన అధికారులను పిలిచి మొదటిసారిగా మందలించినట్లు తెలుస్తుంది, అంతే కాకుండా రెండవసారి కూడా ప్రజల నుండి ఆ విభాగాలపై ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే ప్రజలు జనన, మరణ ధ్రువీకరణ లేక ఇతర ధ్రువీకరణ పత్రాల జారీ కోసం చలానా చెల్లించిన 48 గంటల తరువాత ధ్రువీకరణ పత్రాలు పొందవచ్చని అన్నారు. ఒకవేళ ధ్రువీకరణ పత్రాల మంజూరులో ఏదైనా జాప్యం జరిగితే నేరుగా మున్సిపల్ కమిషనర్‌ను కలువొచ్చని ఆయన తెలిపారు. ఏది ఏమైనా గిద్దలూరుకు సమర్థవంతమైన మున్సిపల్ కమిషనర్ రావడం వల్లే ఈ ప్రక్షాళన ఆరంభం అయ్యిందని పట్టణంలో చర్చనీయాంశమైంది.

చెరువులో ఈతకు వెళ్లి ఇద్దరు విద్యార్థుల మృతి

2 లో..

జనాలతో కిక్కిరిసిన చెరువు కట్ట

విశాలాంధ్ర-కంభం :

చరిత్ర కలిగిన కంభం చెరువుకట్టకు తేరా తేజీ (గరిక తొక్కుడు) పండుగకు కులమతాలకు అతీతంగా భక్తులు వేలాదిగా తరలివచ్చి దర్గాకు వచ్చి వారి మొక్కుబడులు తీర్చుకున్నారు. పిల్లల కోలాహలంతో ఆటబొమ్మల ఆటలపోటీలు, మహిళలకు గాజుల అలంకరణలు, దుకాణాలు ఎంతో ఆకర్షిణీయంగా నిలిచాయి. పెళ్లయిన కొత్తజంటలు చెరువు నీటిలో వారి పెళ్ళిలో వేసిన పూలదండలు నీటిలో వేసి గంగమ్మ తల్లికి మొక్కుబడి తీర్చుకున్నారు.

భక్తుల జనసంద్రం : తేరా తేజీ (గరిక తొక్కుడు)పండుగకు హైదరాబాద్, గుంటూరు, బెంగళూర్, కర్నూల్, మార్కాపురం, నంద్యాల, గిద్దలూరు, దొనకొండ, వినుకొండ ఆయా ప్రాంతంనుండి ముస్లింలువచ్చి భోజనాలుఏర్పాటు చేసుకొని తమ ఆనందాన్ని పంచుకుంటారు. దూరప్రాంతాలనుండి వచ్చే ప్రయాణికులు చెరువు కట్టకు అనుకోని రైలుమార్గం ఉండటంతో రైళ్లను అక్కడే ఆపి చెరువు కట్టకు చేరుకుంటారు. శని,ఆదివారాలు సెలవు దినాలుకావటంతో ఈసారి తేరా తేజీ (గరిక తొక్కుడు) పండుగ వరుసగా మూడురోజులు జరిగే అవకాశాలు ఉన్నాయి. శుక్రవారం రోజు తేరా తేజీ (గరిక తొక్కుడు) పండుగ కావడంతో కొత్తజంటలు, వారి బంధుమిత్రులు, స్నేహితులతో చెరువుకట్ట కోలాహలంగా మారింది. మైనారిటీ యువనేత ఇర్ఫాన్ చెరువుకట్టకు వచ్చిన వారందరికి ఉచిత మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేశారు.

పోలీసుశాఖకు అభినందనలు : సుమారు 5 వేలకు పైగా వచ్చిన భక్తులకు ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా, అసౌకర్యం కలగాకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రత్యేక శ్రద్ధతో అందరికి సహాయం చేసిన కంభం పోలీస్ శాఖకు ముస్లిం సోదరులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

చెరువులో ఈతకు వెళ్లి ఇద్దరు విద్యార్థుల మృతి

విశాలాంధ్ర-పెద్ద దోర్నాల : ఈతకు వెళ్లి ఇద్దరు విద్యార్థులు మృతి చెందిన సంఘటన మండలంలోని చిన్న గుడిపాడు చెరువులో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం మండలంలోని చిన్నగుడిపాడు గ్రామానికి చెందిన విద్యార్థులు పాఠశాలలు సెలవు కావడంతో సరదాగా ఈతకు వెళ్లి ఇద్దరు విద్యార్థులు లోతు తెలియక గుంతలో ఇరక్క పోవడంతో విద్యార్థులు మృతి చెందారు. జమ్మి దోర్నాల గ్రామానికి చెందిన అద్భుత కుమార్ 16 సంవత్సరాలు మృతి చెందాడు. మృతి చెందిన విద్యార్థి దోర్నాల ఇంటర్మీడియట్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. అదే గ్రామానికి చెందిన పులుకూరి పవన్ కుమార్ 14 సంవత్సరాలు, మృతి చెందాడు. ఈ విద్యార్థి దోర్నాల ప్రభుత్వ ఉన్నత

పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. సరదా కోసం ఈతకు వెళ్లి ప్రాణాల మీదికి తెచ్చుకున్నారు. సమాచారం అందుకున్న వెంటనే దోర్నాల ఎస్ఐ వి.మహేష్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని, ఈతకు వెళ్లి మృతి చెందిన విద్యార్థులను సంఘటనా స్థలంలో వారిని బయటికి తీసి, పోస్టుమార్టం కోసం మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. దోర్నాల ఎస్సై వి మహేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఆ గ్రామంలో విషాదఛాయలు అలుము కున్నాయి.

సంతాపం తెలిపిన ఎరిక్షన్ బాబు :

పెద్ద దోర్నాల మండలం జమ్మిదోర్నాల గ్రామంలో ఈతకు వెళ్ళిన ఘటనలో విద్యార్థులు అద్భుత్ కుమార్, పవన్‌ల మృతి వార్త నన్ను తీవ్రంగా కలచివేసింది. అల్లారుముద్దుగా పెంచిన పిల్లలు ఇలా మృతి చెందటం ఆ కుటుంబాలకు తీరని లోటు. వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నాను. వారికి ప్రభుత్వం తరపున అండగా ఉంటామని ఎర్రగొండపాలెం టిడిపి ఇంచార్జ్ గూడూరి ఎరీ క్షన్ బాబు సానుభూతి తెలిపారు.

దండ్రయాత్ర

(మొదటిపేజీ తరువాయి)

18 డెంగ్యూ కేసులు నమోదయ్యాయని తెలిపారు. ప్రభుత్వం పూర్తిస్థాయిలో జాగ్రత్తలు తీసుకుంటోందని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ప్రతి గ్రామంలో ఫాగింగ్ తప్పనిసరిగా నిర్వహించాలని, వారంలో ఒక రోజు డ్రై డేగా పాటించి నీటి నిల్వలను తొలగించాలన్నారు. ఫీవర్ సర్వేలు నిరంతరంగా కొనసాగించాలన్నారు. వాటర్ ట్యాంకుల్లో గాంబూషియా చేపలు వదలడం ద్వారా దోమల వృద్ధిని నియంత్రించవచ్చని చెప్పారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందులు, ఐవి ఫ్లూయిడ్లు, మంచాలు ముందస్తుగా సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఆర్ఎంపీలు ప్రాథమిక చికిత్సకే పరిమితమవ్వాలని హెచ్చరించారు. సంక్షేమ హాస్టళ్లలో దోమల నివారణ చర్యలు చేపట్టాలని, విద్యార్థుల ఆరోగ్య బాధ్యత వార్డెన్లపై ఉండాలని పేర్కొన్నారు. వైద్య సిబ్బంది ప్రతి డెంగ్యూకేసును ఖచ్చితంగా నివేదించాలని, సమయానికి సమాచారం అందితే మెరుగైన చికిత్స కల్పించ గలమన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి, జ్వరం వచ్చిన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిని ఆశ్రయించాలని సూచించారు. తాగే నీటికి మూతలు వేయాలని, ఇంటి పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలని కోరారు. ప్రజల ఆరోగ్య భద్రతపై ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకుంటుందన్న హామీ ఇచ్చారు. సెలవు దినాలలోను అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పంచాయతీల్లో పారిశుధ్యంపై మానిటరింగ్ పెంచాలని డీపీఓను, హాట్‌స్పాట్ ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య బృందాలను ఏర్పాటు చేయాలని డీఎంహెచ్‌ఓకు సూచించారు. తాగే నీటి ట్యాంకుల శుభ్రతపై చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు, పాఠశాలల్లో డెంగ్యూపై అవగాహన తరగతులు నిర్వహించాలంటూ విద్యాశాఖను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ విజయమ్మ, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్.ఈ. అన్నంత రాజు, జిల్లా వ్యవసాయాధికారి సుబ్రహ్మణ్యం, డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నకిలీ వార్తలు - తప్పుడు సమాచారాల నివారణపై ఎంపీ మాగుంట ప్రశ్న

విశాలాంధ్ర-ఒంగోలు : ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ తనిఖీ యూనిట్ల సమాచారంతో ఇంటర్నెట్‌లో నకిలీ వార్తలు మరియు తప్పుడు సమాచారాలు ఇచ్చే అన్ని ప్రసార మాధ్యమాలు, నిర్వహిస్తున్న కంపెనీలు - వ్యక్తుల గుర్తింపు, వసూలుచేసిన మొత్తం మరియు ప్రైవేటు తనిఖీ యూనిట్ల వాడకం గురించి ప్రస్తుత పార్లమెంటు సమావేశాలలో ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్నించారు.దీనికి కేంద్ర సమాచార మరియు ప్రసార శాఖ సహాయక మంత్రి యల్. మురుగన్ సమాధానమిస్తూ తప్పుడు సమాచార వెబ్ సైట్ల వలన

సామాజిక నిర్మాణం దెబ్బతినే అవకాశం వున్నదని మరియు దేశ సార్వభౌమాధికారం, రక్షణ, సమగ్రత, రాష్ట్ర మరియు ప్రజా శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని అలాంటి వెబ్ సైట్లను అడ్డుకోడానికి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యాక్ట్ 2000 ను ప్రభుత్వం జారీచేసిందని తెలిపారు. కేంద్రానికి సంబంధించి వచ్చే నకిలీ వార్తలను అడ్డుకోడానికి కేంద్ర సమాచార మరియు ప్రసార శాఖ వాస్తవ తనిఖీ యూనిటును 2019 నెలకొల్పిందని, నకిలీ వార్తల యదార్థతను యూనిటు పరిశీలించి, యదార్థాన్ని తన సామాజిక మాధ్యమ వేదికలలో ఉంచుతుందని తెలిపారు.యదార్థ సేకరణకు ప్రైవేటు తనిఖీ యూనిట్లను ప్రభుత్వం ఏర్పాటుచేయలేదని, తప్పుడు సమాచారాల పరిష్కరణకు ఇతర చట్టపర నిభందనలు ఏర్పాటు చేసిందని తెలిపారు. వార్తా పత్రికలు, టెలివిజన్, డిజిటల్ మాధ్యమాలు జర్నలిస్టిక్ ప్రవర్తన నిభందనలకు మరియు ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, కేబుల్ టెలివిషన్ నెట్ వర్క్ రెగ్యులేషన్ చట్టం మరియు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రూల్స్ క్రింద రూపొందించిన నిభందనలకు తప్పక కట్టుబడివుండాలని మరియు నిభందనలను అతిక్రమించిన వాటిపై విచారణ జరిపి తగు చర్యలు ప్రభుత్వం తీసుకుంటుందని కేంద్ర మంత్రి తెలియజేశారు.

35 మద్యం బాటిళ్లు స్వాధీనం

- ఎక్సైజ్ సీఐ అరుణకుమారి

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండలంలోని చినారి కట్ల జంక్షన్‌లో కూల్ డ్రింక్ షాప్‌లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళను అదుపులోకి తీసుకున్నట్లు, ఎక్సైజ్ సీఐ పి.అరుణకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. మహిళ వద్ద ఉన్న 35 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని ఆ మహిళపై కేసు నమోదు చేసినట్లు అరుణకుమారి పేర్కొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లతో రగడ

(మొదటిపేజీ తరువాయి)

రీడింగ్ తీసుకోవడం, లోడును బట్టి ఛార్జీలు వేయడం స్మార్ట్ మీటర్ల ధర భరించాల్సి ఉండడంతో పాటు ఇంకా ఎన్నో కారణాలతో సామాన్యులు షాక్‌కు గురయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. వీటి వల్ల సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు పెనుభారం కానున్నాయి. ఇప్పటికే వ్యాపార, వాణిజ్య సముదాయాలకు బిగించిన స్మార్ట్ మీటర్లతో ఆ వర్గాలను కలవర పెడుతున్నాయి. తాజాగా గృహ వినియోగదారుల వంతు వచ్చిందని చెప్పాలి. రానున్న రోజుల్లో ప్రజల కష్టార్జితంలో సింహభాగం స్మార్ట్ మీటర్ల ద్వారా వచ్చే విద్యుత్ బిల్లులకే సరిపోయే ప్రమాదం ఉందంటే అతిశయోక్తికాదేమో.స్మార్ట్ మీటర్ల విషయంలో అన్ని వర్గాల ప్రజలు వ్యతిరేకిస్తున్నప్ప టికీ కూటమి ప్రభుత్వం ఆదాయాన్ని పిండుకోవడమే లక్ష్యంగా ముందుకు సాగుతోందని ఆరోపణలు ఉన్నాయి.

- సర్దుబాటుతో బాదుడే బాదుడు :

ఓ వైపు విద్యుత్ చార్జీలను పెంచేదిలేదని కూటమి ప్రభుత్వం చెబుతున్నా సర్దుబాటు, ఎఫ్.పి.పి.సి.ఎ, ట్రూఅప్ పేరిట వినియోగదారుల నుంచి ముక్కుపిండి అదనంగా బిల్లులు వసూలు చేస్తున్నారు. ఏడాదికే రూ.30వేల కోట్ల భారం ప్రజల నెత్తిన పడింది.సర్దుబాటు ఛార్జీల రూపంలో రూ.15485 కోట్లు మోపినట్లు తెలుస్తోంది. 2019-2024 మధ్య కాలంలో వాడిన విద్యుత్ పైనా రూ.12వేల కోట్లకు పైగా భారం మోపేందుకు రంగం సిద్ధమైనట్లు సమాచారం. ఈ విషయాలలో సంబంధిత శాఖ అధికారులు మిన్నకుండిపోతున్నారు.

- స్మార్ట్ దోపిడీకి రంగం సిద్ధమా :

గృహాలకు స్మార్ట్ మీటర్లు బిగింపు విషయంలో ప్రభుత్వం ఆచితూచి అడుగులు వేస్తోందని అర్థమవుతుంది. ఈలోగా మీటర్లలో అవసరమైన సాంకేతిక మార్పులు చేసినట్టు స్పష్టమవుతోంది. వినియోగదారులు తమ గృహాలకు స్మార్ట్ మీటర్లు వద్దు బాబోయ్ అంటూ మొత్తుకుంటున్నా, ప్రభుత్వం పెడచెవిన పెడుతోందని ఆరోపణలు వినవస్తున్నాయి. ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ధరను రూ.9 వేలుగా నిర్ణయించినట్లుగా తెలుస్తోంది. ఇది సింగిల్ ఫేజ్ ధర కాగా,త్రీఫేజ్ మీటరు ధర రెట్టింపుగా ఉండవచ్చు.మొత్తం మీద సుమారు రూ.17వేల వరకు వసూలు చేయవచ్చని అంచనా.ఈ మొత్తం కూడా వినియోగదారులు భరించాల్సిందే.మీటరు ధరను ప్రతి నెలా వాయిదాల పద్ధతిలో చెల్లించాల్సి ఉంటుంది. ఈ మీటర్లు ఆరేళ్ల వరకు మాత్రమే పని చేస్తాయని,ఆ తర్వాత వినియోగదారులు నగదు చెల్లించి కొత్త మీటరు తీసుకోవాల్సి ఉంటుందట.స్మార్ట్ మీటర్లు బిగించే విషయంలో విద్యుత్ శాఖ అధికారులపై తీవ్రస్థాయిలో ఒత్తిడి ఉన్నట్లు తెలుస్తోంది.ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లను బిగించేందుకు నెల వారీగా టార్గెట్లను సైతం ప్రభుత్వం ఇస్తున్నట్లు సమాచారం.మరోవైపు ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుండటంతో అధికారులు సందిగ్ధంలో పడుతున్న పరిస్థితులు ఉన్నాయి.స్మార్ట్ మీటర్లు బిగించక ముందు కమర్షియల్ కనెక్షన్లకు విద్యుత్ బిల్లు సరాసరి రూ.3 వేలు వచ్చేది. బిగించిన తర్వాత రూ.30వేలకు పైగా బిల్లులు వస్తు న్నాయని నిర్వాహకులు బాహాటంగానే తమ గోడును వెలిబుచ్చుతున్నారు.తమ సమస్యలను తెలిపేందుకు విద్యుత్ అధికారుల వద్దకు వెళ్లగా చేతులు ఎత్తేస్తున్నారు. వాడితే ఛార్జీల మోత మోగుతుందని ఆవేదన చెందుతున్నారు.

- రీఛార్జ్ చేయకపోతే పవర్ కట్ :

సాధారణ, మధ్యతరగతి కుటుంబాలు కష్టపడి సంపాదించుకున్న సంపాదనలో స్మార్ట్ మీటర్ల బిల్లులకు సరిపోతోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి నెలా సాధారణ వినియోగదారునిపై రూ.500 నుంచి రూ.800 వరకు అదనపు భారం పడనుంది. అంతేకాకుండా వీటికి ముందుగానే రీఛార్జ్ చేయాలి. మొబైల్ ఫోన్‌కు ఎలా చేయిస్తామో భవిష్యత్తులో స్మార్ట్ మీటర్లకు కూడా రీఛార్జ్ చేయించుకోవాలి.ఒకవేళ అమౌంటు అయిపోతే కరెంట్ సరఫరా కూడా ఆగిపోతుంది. ప్రస్తుతం మీటరు రీడింగ్,డిమాండ్ నోటీసు జారీ విధానం నిలిపివేస్తున్నారు.విద్యుత్ మీటర్‌కు లింక్ అయిన ఫోన్ నెంబరుకు బిల్లు జారీ చేస్తున్నారు. అలాగే ఏపీఈపీడీసీఎల్ యాప్‌లో సర్వీసు నెంబరు నమోదు చేసుకోవాల్సి ఉంది.నెల రోజులు ఆలస్యమైతే ఎటువంటి సమాచారం లేకుండా సరఫరా నిలిపివేస్తున్నారు.అయితే ఏకకాలంలో రెండు నెలల బిల్లు ఒకేసారి చెల్లిస్తేనే తిరిగి సరఫరా పునరుద్ధరిస్తున్నారు. పని చేస్తున్న మీటర్లను తొలగించి, ఆదాయాన్ని పెంచుకునేందుకు ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను బిగిస్తున్నట్లు సర్వత్రా విమర్శలు వచ్చిపడుతున్నాయి.మొదట 33, 11కేవీ ఫీడర్లు,నాన్ అగ్రికల్చర్ కనెక్ట్ (డీటీఆర్), ప్రభుత్వ సర్వీసులు, పరిశ్రమలు, కమర్షియల్ కనెక్షన్లకు విద్యుత్ శాఖ స్మార్ట్ మీటర్లు బిగించింది. కొద్ది రోజులుగా 200 యూనిట్ల పైబడి విద్యుత్ వినియోగిస్తున్న గృహ కనెక్షన్లకు కూడా బిగించడం ప్రారంభించారు. కానీ కొందరు వినియోగదారులు వ్యతిరేకిస్తున్నారు. ఇళ్లకు మీటర్లు వద్దని చెబుతున్నా,బిగించడానికి ప్రయత్నిస్తే, 100కు కాల్ చేసి పోలీసుల దృష్టికి తీసుకుపోవచ్చు.యజమాని అనుమతి లేకుండా స్మార్ట్ మీటర్లు బిగించే అధికారం విద్యుత్ శాఖకు లేదని విశ్లేషకులు చెబుతున్నారు.

- విద్యుత్ ఉద్యమానికి తప్పదని వామపక్షాలు, ప్రజాసంఘాలు హెచ్చరికలు :

కూటమి ప్రభుత్వం స్మార్ట్ విద్యుత్ మీటర్లను బిగించే నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వామపక్షాలు, ప్రజాసంఘాలు ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు, వినియోగదారులతో కలిసి విద్యుత్ కార్యాలయాల ఎదుట నిరసనలు హోరెత్తించారు. సీపీఐ తరపున రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఎం నుంచి కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జిల్లా, నియోజకవర్గ కేంద్రాలలోని వామపక్షాలు, ప్రజాసంఘాల నేతలు నినదించారు. స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని ఉపసంహరించుకోవాలని హితవు పలికారు. లేనిపక్షంలో సామాన్య ప్రజల కోసం మరో విద్యుత్ ఉద్యమానికి నాంది పలకాల్సి వస్తుందని హెచ్చరికలు జారీ చేశారు.

మరో బషీర్ బాగ్ విద్యుత్ ఉద్యమం తప్పదేమో

సీపీఐ బాపట్ల జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ

విద్యుత్ సమస్యలపై నాడు జరిగిన బషీర్ బాగ్ లాంటి ఉద్యమాలు కూటమి ప్రభుత్వానికి కనువిప్పు కలగకపోవడం శోచనీయం. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లు బిగించవద్దని, వాటిని పగులగొట్టాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చిన సంగతి మరచిపోయి, అధికారంలోకి రాగానే అవగాహన కల్పించి బిగించాలని చెప్పడంలో మతలబు ఏమిటి అని ప్రశ్నించారు. విద్యుత్ శాఖ మంత్రి సైతం స్మార్ట్ మీటర్లు బిగించే విధానంలో వద్దని వారికి తప్పా, మిగిలిన వారికి ఏర్పాటు చేయాలని చెప్పడంలో ఆంతర్యం ఏమిటో పెరుమాళ్లకే ఎరుక. అదానితో సోలార్ అగ్రిమెంట్ లోనూ లోపాయకారి ఒప్పందం చేసుకున్నట్లు తెలుస్తోంది. నాడు వైసీపీ ప్రభుత్వం అవినీతి ఆరోపణలు చేసిన వారితోనే కూటమి ప్రభుత్వం అగ్రిమెంట్ చేయడం సమంజసమేనా. స్మార్ట్ మీటర్లపై ప్రభుత్వం తన నిర్ణయం వెనక్కి తీసుకోకుంటే ప్రజల తరపున ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.

పూర్వ విద్యార్థుల అతిథి ఉపన్యాసం

విశాలాంధ్ర-ఒంగోలు : స్థానిక క్విస్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చేరిన విద్యార్థులకు బ్రిడ్జ్ కోర్సు నిర్వహిస్తున్నారు. ఆ కార్యక్రమంలో భాగంగా క్విస్ కళాశాలలో చదివి, ఇప్పుడు ఉన్నతస్థానాల్లో ఉన్న పూర్వ విద్యార్థులు మొదటి ఏడాది విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. తమ అనుభవాలను పంచుకున్నారు. క్విస్ కళాశాలలో మెకానికల్ 2011 - 2015 బ్యాచ్‌కు చెందిన ఎస్. జయంత్ బాబు ప్రస్తుతం సర్వీస్ నౌ అనే కంపెనీలో ఉన్నత స్థానంలో ఉన్నారు. జయంత్ తన అనుభవాలను ప్రస్తుత విద్యార్థులతో పంచుకున్నారు. ప్రస్తుతం అవకాశాలు ఎలా ఉన్నాయి? టెక్నాలజీలో వచ్చిన మార్పులు ఏంటి? తదితర విషయాలపై జయంత్ అవగాహన కల్పించారు. క్విస్ లో చదివిన పూర్వ విద్యార్థులు ఎంతోమంది ఉన్నతస్థానాల్లో ఉన్నారని, ఇక్కడి ఉపాధ్యాయులు, మేనేజ్మెంట్ సహకారంతోనే అది సాధ్యం అయ్యిందని అన్నారు. అప్పటికి ఇప్పటికి కళాశాలలో అద్భుతమైన మార్పులు వచ్చాయని, ఇన్ ఫ్రాస్ట్రక్చర్ తదితర అంశాల్లో చాలా మార్పులు జరిగాయని, ఐడియా ల్యాబ్ లాంటివి విద్యార్థులకు చాలా ఉపయోగపడతాయని, వాటిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థుల మధ్య కమ్యూనికేషన్ పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని జయంత్ బాబు చెప్పారు. కళాశాల మొత్తం తిరిగి చూసిన జయంత్ బాబు.. క్విస్ ఇంజినీరింగ్ కళాశాల దేశంలో ఉత్తమ కళాశాలల్లో ఒకటిగా ఉండటం ఆనందంగా ఉందని, అలాంటి కళాశాలను ఎన్నుకున్నందుకు మొదటి ఏడాది విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. ఈ అవకాశం ఇచ్చిన విద్యాసంస్థల అధినేత డాక్టర్ సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీగాయత్రికి ఆయన అభినందనలు తెలియజేశారు. ఉత్తమమైన విద్యను అందిస్తుంది ఎంతోమందిని తీర్చిదిద్దుతున్నారని ఆయన ధన్యవాదాలు తెలిపారు. పూర్వ విద్యార్థులు ముందుకు వచ్చి కళాశాలలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం జయంత్ బాబును కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.వి. హనుమంతరావు పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర మహా సభలను జయప్రదం చేయండి

- బాణాల రామయ్య

విశాలాంధ్ర-త్రిపురాంతకం : ఆగస్టు నెలలో జరుగు రాష్ట్ర 28వ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బాణాల రామయ్య పిలుపు నిచ్చారు. త్రిపురాంతకం మండలంలోని త్రిపురాంతకం రాజుపాలెం గ్రామం 28వ మహాసభల కరపత్రాల పంపిణీ, నిధుల సేకరణ కార్యక్రమం శుక్రవారం చేపట్టారు. సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి.శ్రీనివాస్ మాట్లాడుతూ నియోజకవర్గ కార్యదర్శి బాణాల రామయ్య ఆగస్టు నెలలో జరుగు రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. గ్రామంలోని సీపీఐ నాయకులను, రైతు సంఘం నాయకులను, కార్మికులను కలుసుకున్నారు. వారి యోగ క్షేమములు అడిగి తెలుసుకున్నారు. వారి కుటుంబంలో ఉన్నా ప్రతి ఒక్కరిని రాష్ట్ర మహా సభల్లో పాల్గొనాలని ఆహ్వానం అందించారు. ప్రతి గ్రామం నుండి అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వై.టి ఆంజనేయులు, గ్రామస్థులు చల్ల వెంకటయ్య, చెన్నరెడ్డి, వెంకటస్వామి, సీపీఐ నాయకులు మరికొందరు కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఏపీ హరిజనవాడలో తాగు నీటికి కటకట

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండల కేంద్రమైన కొనకనమిట్లలోని ఏపి హరిజనవాడ కాలనీలలో తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాగర్ నీటి సరఫరా జరగక మూడు నెలలు దాటింది దీంతో తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జూలై నెల వరకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసి నీటి సరఫరా ఆపేశారు. ఎనిమిది రోజులు నుంచి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా కూడా జరగడం లేదు. దీంతో వాడు కొనే నీటికి ఇబ్బంది పడుతున్నామని పశువులు గేదెలకు కూడ తాగునీటికి ఇబ్బందిగా ఉందని కాలనీవాసులు వాపోతున్నారు. గ్రామంలో మండల స్థాయి అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్న పట్టించుకునే వారే లేరని కాలనీవాసులు ఆవేదన చెందుతున్నారు. డబ్బులు వెచ్చించి మినరల్ వాటర్‌ను తెచ్చుకోవాల్సిన పరిస్థితి తప్పడం లేదని అంటున్నారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని సాగర్ నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని, వాడుకునే నీటిని కూడా సరఫరా చేయించాలని వేడుకుంటున్నారు.

11న సదస్సు విజయవంతం చేయాలి

ఎంపీడీకే పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు కాలేబ్ మాదిగ

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మార్కాపురంలో ఈ నెల 11న జరిగే చర్మ కారుల డప్పు కళాకారుల సదస్సును విజయవంతం చేయాలని ఎంసి డికె పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు సాంద్రపాటి కాలేబ్ మాదిగ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం మండలంలోని ఎదురోళ్లపాడు ఎస్సీ కాలనీలో పర్యటించి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 35 సంవత్సరాలు నిండిన మాదిగలకు చర్మ డప్పు కళాకారుల పెన్షన్ మంజూరు చేయాలని ఎస్సీ, ఎస్టీ మహిళలకు రెండెకరాల వ్యవసాయ భూమి ఇవ్వాలని ఎస్సీ ఎస్టీ ఆడపడుచులకు పెళ్లి కానుక పథకం కింద పెళ్లిరోజు రెండు లక్షల రూపాయలు అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

వివాహ వేడుకలో..కదిరి పార్థసారథి

విశాలాంధ్ర-సిఎస్‌పురం : కోవిలంపాడు గ్రామానికి చెందిన దొనపాటి మోహన్ రెడ్డి కుమారుని వివాహం సందర్భంగా గురువారం రాత్రి కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ కదిరి పార్థసారథి నూతన వధూవరులను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కేశవ రెడ్డి, మాజీ ఎంపిటిసి మూరం కాశిరెడ్డి, టి బాబురావు, సున్నా నారాయణ, కాశయ్య, నరసయ్య పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే 'ఉగ్ర'

విశాలాంధ్ర-పామూరు : కనిగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పాలపర్తి వెంకటేశ్వర్లు మేనకోడలు ఎగటిల శ్రీదేవి వివాహ వేడుకలు శుక్రవారం స్థానిక బాల సుబ్బయ్య నగర్‌లో జరిగాయి. కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి పాల్గొని నూతన వధువును ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు. టిడిపి మండల అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, కనిగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యారవ రమా శ్రీనివాస్, సింగల్ విండో అధ్యక్షులు ఉప్పలపాటి హరిబాబు, ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షులు ఆకుపాటి వెంకటేష్, కనిగిరి నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు పందిటి హరీష్, డాక్టర్ గద్దె ఏడుకొండలు, పిడుగు శ్రీనివాసులు, కొండిచెట్టి వెంకటరమణయ్య, పువ్వాడి బిల్డర్ వెంకటేశ్వర్లు, పువ్వాడ రామారావు, ఆర్ఆర్ రఫీ, వాయినేని రాఘవ వివాహ వేడుకలలో పాల్గొని నూతన వధువును ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.

వరలక్ష్మీ వ్రత శుభాకాంక్షలు

విశాలాంధ్ర-పామూరు : శ్రీ లక్ష్మీదేవి దివ్య ఆశీస్సులతో సిరిసంపదలతో సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని కోరుకుంటూ మండల ప్రజలకు శ్రీ శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతం శుభాకాంక్షలను ఎంపీపీ గంగసాని లక్ష్మి హుస్సేన్ రెడ్డి తెలియజేశారు.

ధ్వజ స్తంభ ప్రతిష్ఠలో ఎమ్మెల్యే ముత్తుముల

విశాలాంధ్ర-గిద్దలూరు : గిద్దలూరు మండలం గుమ్ముళ్లపల్లె గ్రామంలో శ్రీ సీతారాముల వారి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామ నాయకులు, గ్రామస్తులు మేళతాళాలతో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ బెల్లంకొండ సాయిబాబు, గిద్దలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ బైలడుగు బాలయ్య, స్థానిక నాయకులు గుండ్రెడ్డి రమణయ్య, వైజా కృష్ణారెడ్డి, కటూరు కృష్ణ, టీడీపీ, జనసేన మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు, దామచర్ల చిత్రపటాలకు పాలాభిషేకం

విశాలాంధ్ర-ఒంగోలు : ఒంగోలు నగరంలో నాయి బ్రాహ్మణుల ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు నాయుడు మరియు స్థానిక శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ రావు చిత్రపటాలకు నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు పాలభిషేకం చేశారు. నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు మాట్లాడుతూ నాయి బ్రాహ్మణుల్ని ఆదుకున్న ఘనత అప్పటికి ఇప్పటికీ ఒక చంద్రబాబు నాయుడికే చెందుతుందని, గతంలో కూడా ఆదరణ పథకం ద్వారా నాయి బ్రాహ్మణ ఆదుకున్నారు, తర్వాత 150 యూనిట్లు ఉచిత విద్యుత్తు బార్బర్స్‌కు కేటాయించడం జరిగింది. మరలా 50 యూనిట్లు పెంచుతూ 200 యూనిట్లు చేసి నాయి బ్రాహ్మణ ఆదుకోవడం జరిగింది, ఇందుకు సీఎం చంద్రబాబు నాయుడుకు స్థానిక దామచర్ల జనార్ధన్ రావుకి ఒంగోలు నియోజకవర్గం నాయి బ్రాహ్మణులుగా మీకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము అన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కార్పొరేషన్ డైరెక్టర్ నిడమానూరి రమేష్, పెళ్లూరి చిన్న వెంకటేశ్వర్లు, పిలుట్ల సుధాకర్ రావు, అన్నవరపు వెంకటరావు, కొణిజేటి రామకృష్ణ, గుంటూరు సారధి, నిడమానూరి యలమందరావు, బూసరపల్లి శ్రీను పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో వరలక్ష్మి వ్రతం

విశాలాంధ్ర - తాళ్లూరు: శ్రావణ శుక్రవారం వరలక్ష్మి వ్రతాన్ని మహిళలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భక్తి శ్రద్ధలతో పూజిస్తే వరాలు అందించే వరక్ష్మి దేవికి మహిళలు ఎంతో పవిత్రంగా వేకువజాము నుండే ఒక్కపొద్దులు ఉండి వ్రతాన్ని ఆచరించారు. బొద్దికూరపాడు గంగా పార్వతి వర్ధిని సోమేశ్వర స్వామి ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలను నిర్వహించారు. మహిళలు వ్రతాన్ని ఆచరించి ఐదుగురు ముత్తయిదువులను తాంబూలాలు, ప్రసాదాలు ఇరుగు పొరుగు మహిళలకు అందించారు. దీంతో గ్రామాలలో భక్తి బావం వెల్లివిసిరింది. పలు ఆలయాలలో కూడ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్ధ ప్రసాదాలు అందించారు.

వినుకొండకు వెళ్లిన సీపీఐ శ్రేణులు

విశాలాంధ్ర-దాచేపల్లి : సీపీఐ పల్నాడు జిల్లా మహాసభలు వినుకొండలో జరుగుతున్న విషయం విధితమే. దీనిలో భాగంగానే పోరాటాల పోరుగడ్డ దాచేపల్లి ప్రాంతం నుంచి అన్ని శాఖలకు చెందిన పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, కార్మికులు, కర్షకులు, మహిళలు, వ్యవసాయ కూలీలు వందలాది మంది తరలివెళ్లారు.

ధనలక్ష్మీ అలంకరణలో అమ్మవారు

విశాలాంధ్ర- దాచేపల్లి : శ్రావణ మాసం లో భాగంగా శుక్రవారం అమ్మ వారి ఆల యాలు భక్తులు, మహిళలతో కిటకిటలాడాయి. దీనిలో భాగంగానే కొట్ల బజారులో ఉన్న శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ అమవారిని డబ్బులతో అలంకరించారు. ధనలక్ష్మి అలంకరణలో ఉన్న అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీలక్ష్మి తిరుపతమ్మ పాత ఆలయంలో అమ్మవారిని లక్ష గాజులతో అలంకరించారు. శ్రీవీర్ల అంకమ్మతల్లి ఆలయానికి టీడీపీ సీనియర్ నాయకుడు తోట వెంకటేశ్వర్లు రూ.1.75 లక్షలతో గాజులతో పాటు రూపులు అందజేశారు. వీటితో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. గాయత్రీమాత ఆలయంలో పూజలు చేశారు.

ఈ-పంట నమోదు చేయించుకోవాలి

విశాలాంధ్ర-దుర్గి : మండలంలోని అన్ని గ్రామాల రైతు సోదరులందరూ కూడా తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి వై.అమీర్ రెడ్డి కోరారు. రైతు సేవ కేంద్రంలో సంప్రదించి పంట నమోదును చేయించుకోవాల్సిందిగా తెలిపారు. మీ పంటల ఉత్పత్తులను అమ్ముకొనుటకు పంట నమోదు తప్పనిసరి, పంటల బీమా పథకాన్ని ఆగస్టు 14వ తేదీ వరకు పొడిగించడం జరిగిందని, రైతు సోదరులు అందరూ కూడా ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాని తెలియజేశారు. ఇన్సూరెన్స్ నమోదు చేయుటకు కామన్ సర్వీస్ సెంటర్ లేదా పోస్టాఫీస్ లేదా బ్యాంకు, ప్రజాసేవ కేంద్రంను సంప్రదించాలని అన్నారు. అన్నదాత సుఖీభవ డబ్బులు పడినవారు గ్రీవెన్స్ ఓపెన్ చేశారని, రైతు సేవ కేంద్రాన్ని సంప్రదించి మీ గ్రీవెన్స్‌ను నమోదు చేసుకోవాలని చెప్పారు.

యోగ సాధనలో చిన్నారులు

విశాలాంధ్ర-దాచేపల్లి : నగర పంచాయతీ పరిధిలోని నారాయణపురం యోగ విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం పెద్దలతో పాటు విద్యార్థులు కూడా యోగ సాధన చేశారు. పదో తరగతిలోపు విద్యార్థులు సహ పలువురు చిన్నారులు యోగా నేర్చుకోవడం సంతోషదాయకమని గురువులు ఆనందం వ్యక్తం చేశారు. యోగ చేసే పద్ధతులు, దాని వలన ఆరోగ్యపరంగా ఒనగూరే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమాలను బొద్దు నాగేశ్వరరావు, యర్రంశెట్టి గోపీనాథ్ పర్యవేక్షించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

విశాలాంధ్ర-రొంపిచర్ల : మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు మండల విద్యుత్ శాఖ ఏఈ కె.రాంబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మత్తుల నిమిత్తం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారన్నారు.

సీపీఐ జిల్లా మహాసభలు జయప్రదం చేయాలి

విశాలాంధ్ర-తెనాలి : గుంటూరు జిల్లా సీపీఐ మహా సభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ తెనాలి నియోజకవర్గ కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు, సహాయ కార్యదర్శి తుంగా బాలస్వామి పిలుపునిచ్చారు. తెనాలి గాంధీనగర్ సీపీఐ కార్యాలయ సమావేశ హాలులో శుక్రవారం జరిగిన సమావేశంలో సీపీఐ 26వ మహాసభల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సింగారావు మాట్లాడుతూ జిల్లా మహా సభలు ఈ నెల 17వ తేదీన గుంటూరు కొత్తపేట మల్లయలింగం భవన్ సిపిఐ కార్యాలయం వద్దగల విజయ టాకీస్ స్థలంలో బహిరంగసభ జరుగుతుందని, మధ్యాహ్నం 3 గంటలకు గుంటూరు బ్రహ్మనంద స్టేడియం నుంచి గొప్ప ప్రదర్శన వుంటుందన్నారు. ఆ సభకు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ అధ్యక్షత వహిస్తారన్నారు. సిపిఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి తుంగా బాలస్వామి, పట్టణ కార్యదర్శి మద్దినేని కిరణ్ బాబు మాట్లాడుతూ బహిరంగ సభలో రాష్ట్ర సీపీఐ కార్య దర్శి, మాజీ ఎంఎల్ఏ కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, వెలు గూరి రాధాకృష్ణమూర్తి, జిల్లా నాయకులు మాల్యాద్రి, చిన్న తిరుపతయ్య, చెరుకుమల్లి సింగారావు, బిందెల నాసర్‌జీ, మేడా హనుమంత రావు, ఆకిటి అరుణకుమార్, వుప్పాల సత్యనారాయణ, ముప్పాళ్ళ శివశంకర్, రామిశెట్టి ఆదేశ్వరరావు ప్రసంగిస్తారని అన్నారు. ఆ సభలో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి వారిచే సాంస్కృతిక కార్యక్రమాలుంటాయన్నారు. సభలో గోడపత్రికను సింగారావు, బొల్లిముంత కృష్ణ, బాలస్వామి, కిరణ్‌బాబు, పాశం వెంకటేష్, ఎ.ఐ.ఎస్.ఎఫ్. శివ, పరచూరి వెంకటేశ్వరరావు తదితరులు ఆవిష్కరించారు.

గుంటూరు మలబార్‌లో 'ఆర్టిస్టీ' ఎగ్జిబిషన్ ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం: గివెరీ వారు అత్యధిక డిజైన్లతో ప్రదర్శించిన ఆర్టిస్టీ ప్రదర్శన ఎంతో ఆకర్షణీయంగా ఉందని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళ మాధవి అన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక లక్ష్మీపురంలో ఉన్న మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షో రూమ్‌లో విశిష్ట ఆభరణాలు కలిగిన ఆర్టిస్టీ ప్రదర్శనను ప్రముఖ ఆంకాలజిస్ట్ డాక్టర్ టి.మహతి, వ్యాపారవేత్త పెద్ది రమణారావులతో కలిసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యాపార రంగంలోనే కాక సేవా రంగంలో మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ యాజమాన్యం అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. మైన్ ధ్రువీకరించిన వజ్రాభరణాలు.. వివాహం, పార్టీ సంబరాల కోసం 'ఎరా', అన్ కట్ వజ్రాలతో పొదిగిన 'ప్రేష్య', జాతి రత్నాల సముదాయం కలిగిన 'యత్నిక్స్', హస్తకళ నైపుణ్యంతో తయారుచేసిన ఆభరణాలు 'జోలో' లాంటి ఎన్నో అధునాతన డిజైన్లతో కూడిన ఆభరణాలను ఈ ప్రదర్శనలో ఉంచటం జరిగిందన్నారు. తొలుత ఈ ప్రదర్శనలో ఉంచిన బంగారు, వజ్రాభరణాలను.. జాతీయ రత్న ఆభరణాలను తిలకించారు. ఈ కార్యక్రమంలో స్టోర్ హెడ్ నదీర్, మార్కెటింగ్ మేనేజర్ గోపి కిరణ్, షో రూమ్ సిబ్బంది, పలువురు కస్టమర్లు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ డే రద్దు.. నిరాశతో వెనుదిరిగిన రైతులు

విశాలాంధ్ర-తుళ్లూరు : శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రభుత్వం సెలవు ప్రకటించడంతో తుళ్లూరు సీఆర్‌డీఏ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించాల్సిన గ్రీవెన్స్ డే రద్దు అయింది. ఈ విషయాన్ని ముందుగా తెలియజేయకపోవడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. తమ సమస్యలు వినిపించలేక పోయిన రైతులు నిరాశతో వెనుదిరిగారు. వందలాది కిలోమీటర్లు ప్రయాణించి వచ్చిన రైతులు భూసంబంధిత సమస్యలతో పాటు, సీఆర్‌డీఏ పరిధిలో కౌలు జమకాని, కౌలు చెల్లింపుల వ్యవహారాలపై అధికారులను కలవాలనే ఉద్దేశంతో కార్యాలయానికి చేరుకున్నారు. అయితే కార్యాలయంలో సిబ్బంది లేనందువల్ల వారు తీవ్ర నిరాశ వ్యక్తం చేశారు. సీఆర్‌డీఏ కౌలు పొందే రైతులు కూడా ఈ పరిస్థితితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇప్పటికే మా కౌలు చెల్లింపులు ఆలస్యం అవుతున్నాయి. సమస్య చెప్పుకోవడానికి వచ్చాం. ఇక్కడకు వచ్చేసరికి అధికారులు లేకుంటే మాకు న్యాయం ఎప్పుడు అంటూ వారు వాపోయారు. వారానికి ఒక్కరోజే సమస్యలు వినే రోజు ఉంటుంది. అదే రోజు సెలవంటూ రద్దు చేస్తే, మళ్లీ ఎప్పుడు వస్తాం? మా విన్నపాల దారిదీపం ఎక్కడ? అని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పలు సమస్యలతో సతమతమవుతున్న రైతులను ముందుగానే సమాచారం ఇవ్వకుండా తిరగమండించడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని వారు మండిపడ్డారు. ప్రజాసేవకు ఉన్న ప్రాధాన్యతను గుర్తించి, ఈ తరహా సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ఘనంగా నిర్మల ఫార్మసీలో జాతీయ సదస్సు

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరిలోని నిర్మల ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో 'నెక్స్ట్ జెన్ బయో ఇన్ఫార్మాటిక్స్ ఇంటిగ్రేటెడ్ ఏఐ టూల్స్, ట్రెండ్స్ ఫర్ డ్రగ్ డిస్కవరీ అండ్ డెవలప్మెంట్' అనే అంశంపై రెండు రోజుల పాటు డీబీటీ-సీటీఈఎఫ్ స్పాన్సర్డ్ జాతీయ సదస్సు ఘనంగా నిర్వహించారు. సదస్సు విద్యార్థుల స్వాగతగీతం, నృత్య ప్రదర్శనలతో వైభవంగా ప్రారంభమైంది. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.పాముల రెడ్డి అతిథులకు స్వాగతం పలికారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రెవరెండ్ సిస్టర్ జి.నిర్మల జ్యోతి ప్రారంభ సందేశం అందించారు. రెండు రోజుల సదస్సుకు దేశవ్యాప్తంగా 68 కళాశాలల నుంచి 670 మంది విద్యార్థులు హాజయ్యారు. శాస్త్రీయ అవగాహనతో పాటు ప్రాక్టికల్ శిక్షణ కల్పించడం ఈ సదస్సు ప్రత్యేకత. ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ జి.సింహాచలం(ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఇ/సి రిజిస్ట్రార్), డాక్టర్ జి.ప్రశాంతి, కళాశాల డైరెక్టర్ సిస్టర్ డాక్టర్ యు.శౌరీలు ప్రసంగించారు. అనంతరం ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ జి.స్వప్న సదస్సు ఉద్దేశ్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా సదస్సు సావనీర్‌ను అతిథులు విడుదల చేశారు. ఖ్యాతిగాంచిన నిపుణులు ప్రొఫెసర్ డాక్టర్ ఎం.రాజశేఖర్ రెడ్డి, డాక్టర్ జానకి రామయ్య మేకల, డాక్టర్ కె.నరసింహ రాజు, ప్రొఫెసర్ పెరుగు శ్యామ్, డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి బోనం తదితరులు తమ అనుభవాలను పంచుకున్నారు. విద్యార్థులు పోస్టర్, ఒరల్ ప్రెజెంటేషన్ల ద్వారా తమ పరిశోధనా ప్రతిభను ప్రదర్శించగా, సెంట్రల్ ఇన్స్ట్రుమెంటేషన్ ల్యాబ్, ఫార్మకాలజీ సాఫ్ట్‌వేర్‌పై ప్రత్యేక వర్క్‌షాపులు, ప్రాక్టికల్ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా డాక్టర్ ఎంవీ నాగభూషణం, డాక్టర్ డి.రవిశంకర్ రెడ్డి, డాక్టర్ నీరజ కామాక్షి, డాక్టర్ పి.భార్గవ భూషణ రావు, డాక్టర్ డి.సందీప్ తదితరులు పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమంలో చేబ్రోలు హనుమయ్య ఇన్స్టిట్యూట్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.విద్యాధర్, కేసీ రెడ్డి కళాశాల ప్రిన్సిపాల్ సయ్యద్ మున్నీర్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. పోస్టర్, ఒరల్ ప్రెజెంటేషన్‌లో విజేతలకు బహుమతులు అందజేసి, అతిథులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా శ్రావణమాస ఉత్సవాలు

విశాలాంధ్ర-దుగ్గిరాల: మండల పరిధిలోని కంఠంరాజు కొండూరు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీమహంకాళి అమ్మవారి దేవస్థానంలో గత నెల 25 నుంచి శ్రావణమాస ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా మూడవ శుక్రవారం అమ్మవారి దేవస్థాన ప్రాంగణంలో సామూహిక శ్రావణ లక్ష్మీ వ్రతం నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిపారు. గ్రామాల నుంచే కాకుండా పరిసర ప్రాంతాల నుంచి భక్తులు మహిళలు విశేషంగా పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు సుబ్రహ్మణ్య శర్మ, మణిశర్మ,తారకనాథ్ అమ్మవారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. మహిళ భక్తులకు పసుపు, కుంకుమ, పుష్పాలు, పండ్లు పంపిణీ చేశారు. హైదరాబాదుకు చెందిన నిర్మాత అశ్విని దత్ ఇత్తడితో తయారుచేసిన పంచ లోహాల విగ్రహాలను ఆలయానికి అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి కోగంటి సునీల్ కుమార్, ఆలయ ట్రస్టీ దేవాభక్తుని రంగప్రసాద్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రస్ట్ బోర్డు నియామకానికి నోటిఫికేషన్ జారీ

విశాలాంధ్ర-పెదకాకాని : విజయవాడ దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆదేశాల మేరకు పెదకాకాని శ్రీ మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంనకు ధర్మకర్తల మండలి నియామక నిమిత్తం ఆసక్తి గల అభ్యర్థులు దేవాలయ కార్యాలయం పనివేళలో అప్లికేషన్ ఉచితంగా పొందగలరని ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలా కుమార్ తెలిపారు. ప్రకటన చేసిన 20 రోజులలోపు దేవాలయ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు.

నేడు ప్రపంచ గిరిజన దినోత్సవం

విశాలాంధ్ర-తెనాలి : శనివారం తెనాలి కొత్తపేటలోని తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో అభయాంజనేయస్వామి నాట్యమండలి ఆధ్వర్యంలో రాత్రి 7 గంటలకు ప్రపంచ గిరిజన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదిమవాసి గిరిజనుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు సిహెచ్. సూర్యం, కట్టా సాంబశివరావు, ఎ.వి.ప్రసాద్ తెలిపారు. సభానంతరం అభయాంజనేయస్వామి నాట్యమండలి వారు రాజసర్కి అను పద్య నాటకం ప్రదర్శించనున్నట్లు తెలిపారు. అందరూ ఆహ్వానితులే న్నారు. పద్య నాటకంలో చందు సూర్యం, కట్టా సాంబశివరావు, ఆనందవర ప్రసాద్, అరుణకుమారి, జ్యోతి, ఝాన్సీ, శేషుబాబు, పుల్లారావు, కొండలరావులు నటిస్తారని పేర్కొన్నారు.

రోడ్డు దాటుతూ యువకుడు దుర్మరణం

విశాలాంధ్ర-పెదకాకాని : మండల కేంద్రమైన పెద కాకానిలోని ఆటో నగర్ సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్న గుంటూరు పరమయ్యకుంటకు చెందిన రాచకొండ బుల్లిబాబు(32) తెల్లవారుజామున టీ తాగటం కోసం రోడ్డు దాటుతుండగా విజయవాడ వైపు వెళుతున్న లారీ నాయుడు హోటల్ సమీపంలో యువకుడిని ఢీ కొట్టి ఈడ్చుకొని వెళ్ళటంతో బుల్లి బాబు అక్కడికి అక్కడే మృతిచెందాడు. పోలీసులు వెంటనే సమాచారాన్ని అందుకుని లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకోవాలని ప్రయత్నించగా లారీ వదిలి వెళ్లిపోయాడని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సీఐ టీపీ నారాయణస్వామి తెలియజేశారు.

జిల్లా పేరు మార్పుల్లో

అమర జవాన్లను పరిగణనలోకి తీసుకోవాలి

- మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : జిల్లాల పేర్లు మార్పుల్లో అమర జవాన్ల పేర్లను కూడా పరిగణనలోకి తీసుకోవాలని మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు అన్నారు. రాష్ట్రంలో పరిపాలనా సౌలభ్యం కోసం జిల్లాల పునర్విభజన జిల్లాలకు పేర్లు కూడా మార్చుటకు సీఎం నారా చంద్ర బాబు నాయుడు ఒక కమిటీని వేసి, నెల రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశాలు ఇవ్వటం సంతోషదాయక మని ఈ నిర్ణయాన్ని మాజీ సైనికుల తరపున స్వాగతిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలకు పేర్లు ఖరారు చేసే క్రమంలో దేశం కోసం పోరాడుతూ, దేశ రక్షణలో ప్రాణాలు కోల్పోయిన అమర జవాన్ల పేర్లను కూడా పరిగణనలోకి తీసుకోవాలి అని సూచించారు. సైనికులు వివిధ రకాల యుద్ధాలలో కానీ లేక శత్రువులతో కానీ పోరాడుతూ అసువులు బాసిన సమయాల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆయా స్థానిక ప్రజాప్రతినిధులు గౌరవ వందనాలు చేయటం గర్వించదగిన విషయమని కొనియాడారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమర సైనికుల పేర్లను జిల్లాలకు పెట్టడం వలన దేశానికే ఆదర్శంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిలుస్తోంది అనటంలో ఎలాంటి సందేహమే లేదన్నారు. అమర జవాన్ల పేర్లు జిల్లాలకు పెట్టడానికి రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని అన్ని రాజకీయ పార్టీల నాయకులను విజ్ఞప్తి చేశారు. జిల్లాల పేర్లు మార్పులో అమరవీరుల పేర్లు పరిగణనలోకి తీసుకోవాలని రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం తరపున ముఖ్యమంత్రితో పాటు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ జిల్లాల పేర్లు మార్పు కమిటీ సభ్యులు చీఫ్ సెక్రెటరీలను కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ గౌరవ సలహాదారులు సుంకర శేషగిరిరావు, సీనియర్ మాజీ సైనికులు అబ్దుల్ రజాక్, తాడివాక రుక్మధర రావు తదితరులు పాల్గొన్నారు.

ధర్మకర్తలిమండలి నోటిఫికేషన్ విడుదల

విశాలాంధ్ర-అద్దంకి: జిల్లాలో ప్రసిద్ది పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న సింగరకొండ శ్రీప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం ధర్మకర్తలి మండలి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ తిమ్మనాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు ఈనెల 27వ తేదీ లోపు దేవస్థానం కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

అద్దంకి ఎంఈవోగా శ్రీనివాసరావు

విశాలాంధ్ర-అద్దంకి: అద్దంకి ఎంఈఓ-2గా చక్రాయపాలెం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేవీ శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ ఉన్నతాధికారుల సూచనల మేరకు మండలంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. మండలంలోని ఉపాధ్యాయులు శ్రీనివాసరావుకు శుభాకాంక్షలు తెలిపారు. చీరాల డిప్యూటీ డిఇఓ గంగాధర్ పాల్గొన్నారు.

వైభవంగా వరలక్ష్మి వ్రతం

విశాలాంధ్ర - యద్దనపూడి : మండలంలో పూనూరు గ్రామంలో శ్రీనిదానంపాటి లక్ష్మీ అమ్మవారి ఆలయంలో వరలక్ష్మి వ్రతం వైభవంగా నిర్వహించారు. అర్చకులు నారాయణ మనోజ్ కుమార్ అమ్మవారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి ప్రతి మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. మహిళా భక్తులు వ్రతంలో పాల్గొని కుంకుమ పూజా, అభిషేకాలు, అమ్మవారి అష్టోత్తర నామాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహణ వంకాయలపాటి సుబ్బారావు, సాంబశివరావు, శంకర్, శివయ్య, వాసు వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

రూ.9.75 కోట్లతో రోడ్డు పనులు వేగవంతం

విశాలాంధ్ర - రేపల్లె : గుంతల రోడ్ల కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపారు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ రేపల్లె- నిజాంపట్నం బీటీ రోడ్డు పనులు రూ. 9.75 కోట్లుతో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. మంత్రి తీసుకున్న చొరవతో ఈ రహదారి మార్గం బాగా అభివృద్ధి చెంది ప్రజలకు అందుబాటులోనికి రానున్నది. ఈ రోడ్డు పనులు కాంట్రాక్టర్ దగ్గర ఉండి పర్యవేక్షిస్తూ రోడ్డు పనులు యంత్రాలు, కార్మికుల పనులతో శరవేగంగా చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఏడాది పూర్తి అయిన సందర్భంగా అధ్వానంగా ఉన్న రహదారులను అభివృద్ధి చేసేందుకు తీసుకున్న నిర్ణయం లో భాగంగా బిటి రోడ్డు పనులు వేగంగా జరుగుతూ ఉండటంతో నియోజకవర్గ ప్రజలు హర్షిస్తున్నారు.

నేడే మహేష్ బాబు జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - చీరాల టౌన్ : సూపర్ స్టార్ మహేష్ బాబు పుట్టినరోజు సందర్భంగా శనివారం చీరాలలో వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు మహేష్ బాబు అభిమానుల సంఘం అధ్యక్షులు అబ్దుల్ సలాం తెలియజేశారు. శనివారం ఉదయం 10 గంటలకి స్థానిక గడియార స్తంభం సెంటర్లో ఉన్న వీర రాఘవ స్వామిగుడిలో ప్రత్యేక పూజలు అనంతరం మధ్యాహ్నం చీరాల మహిళా మండలంలో, అనాధ శరణాలయంలో అన్నదాన కార్యక్రమం జరుగుతుందని వెల్లడించారు.

మూతబడిన సులభ కాంప్లెక్స్‌ను పునరుద్ధరించాలి

విశాలాంధ్ర - రేపల్లె : ప్రజలకు అందుబాటులో ఉన్న తాలూకా ఆఫీస్ గేటు ప్రక్కన గల సులభ కాంప్లెక్స్ గత నాలుగు నెలలుగా మూసి వేయడంతో మల, మూత్ర విసర్జనకు వివిధ పనులపై కార్యాలయాలకు వచ్చు వారు చాలా ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని తాలూకా ఆఫీస్ ప్రాంగణంలోనే అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, కోర్టులు ఉండటంతో ప్రతిరోజు వందలాదిమంది మహిళలు, పురుషులు, కార్యాలయాలకు ఆయా పనులపై వస్తుంటారు. ఉదయం నుండి సాయంత్రం వరకు మలమూత్ర విసర్జనకు సరైన స్థలం లేకపోవడం ఉన్న సులభ కాంప్లెక్స్ మూసి వేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సులభ కాంప్లెక్స్ నిర్వాహకులు కాంప్లెక్స్ నిర్వహణ సక్రమంగా చేయకపోవడంతో దాదాపు నాలుగు నెలల క్రితం ఈ సులభ కాంప్లెక్స్ మూతపడింది. అప్పటి ప్రజలు నుండి మలమూత్ర విసర్జనశాలలు లేక ఇబ్బందులు పడుతున్నారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంకీ బాత్ డిజిటల్ యోగంలో కూడా ప్రజల ఆత్మాభిమానం కాపాడుకోవడానికి ప్రత్యేకించి మరుగుదొడ్ల వ్యవస్థను విస్తరింపచేస్తుంటే ఉన్న మరుగుదొడ్లను మూసి వేయటం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రేపల్లె మున్సిపల్ కమిషనర్, పురపాలక సంఘం పాలక వర్గం పాలకులు మూతపడిన సులభ కాంప్లెక్స్‌ను తిరిగి పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరిస్తా

ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

విశాలాంధ్ర - బాపట్ల : ప్రతి సమస్యకు పరిష్కారం చూపిస్తానని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ భరోసా ఇచ్చారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలో ప్రజలు పలు సమస్యలపై ఎమ్మెల్యే వేగేశనకు అర్జీలు ఇచ్చి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాపట్ల నియోజకవర్గాన్ని బంగారు బాపట్లగా చేసేందుకు కృత నిశ్చయంతో ఉన్నానని ప్రజల సంక్షేమం ప్రశాంతమైన జీవనాన్ని గడిపేందుకు శాయశక్తుల కృషి చేస్తున్నానని తెలిపారు. అధికారులు చిత్తశుద్ధితో పని చేసేలా ఆదేశాలు ఇచ్చానని పరిష్కారం కాకుంటే నా దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉండి ప్రతి సమస్యను పరిష్కరిస్తానని తెలిపారు.

ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలి

విశాలాంధ్ర - రేపల్లె : ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించి మీ ఇంటి పరిసరాలలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని మునిసిపల్ కమీషనర్ కె. సాంబశివరావు పట్టణ ప్రజలకు సూచించారు. ఇంటి పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకుని, పనికిరాని వస్తువులలో నీరు నిల్వ లేకుండా ఉంటే డెంగ్యూ, మలేరియా, వంటి వ్యాధులకు కారణమైన దోమలు వృద్ధి చెందకుండా ఉంటాయని ఆయన తెలియచేశారు. పట్టణంలో నీరు నిల్వ ఉన్న ఖాళీ స్థలాలలో దోమల నివారణ కోసం ఆయిల్ బాల్స్ వేయటం, మురుగు కాల్వలలో యాంటీ లార్వల్ ఆయిల్స్ స్ప్రే చేయటం జరుగుతుందని, అదే విధంగా ప్రస్తుత వాతావరణ మార్పుల దృష్ట్యా ప్రజలు నిల్వ ఉంచిన ఆహార పదార్ధాలను భుజించకుండా, వేడి పదార్ధాలనే తీసుకో వాలని సూచించారు. కార్యక్రమాన్ని శానిటరీ ఇన్స్పెక్టర్ ఆకురాతి రామ చంద్రరావు పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శానిటరి సెక్రటరీలు యం. సురేంద్ర, వి. పవన్ కుమార్ తదితర మేస్త్రిలు పాల్గొన్నారు.

పరిశుభ్రతను పాటించండి: గ్లోరియా

విశాలాంధ్ర - బాపట్ల : ప్రతి విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఆర్డీవో గ్లోరియా తెలిపారు. బాపట్ల పట్టణంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం కేంద్రాన్ని తహశీల్దారు షేక్ సలీమాతో కలిసి ఆర్డీవో గ్లోరియా ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా గురుకులం కేంద్రంలో పరిసరాలు పరిశుభ్రత, తాగునీరు సరఫరాపై ఆరా తీశారు. అదేవిధంగా ఆహార నాణ్యత, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులపై అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినీలకు స్వచ్ఛమైన తాగునీరు, ఆహారం శుభ్రతతో రుచికరంగా అందించాలని తెలిపారు. మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ సీహెచ్ కరుణలు ఉన్నారు.

ప్రతిపక్ష పార్టీ వైసీపీ ఫెయిల్

టీడీపీ పార్లమెంట్ నాయకురాలు సరోజిని

విశాలాంధ్ర - బాపట్ల : ప్రజా సమస్యలపై అసెంబ్లీలో చర్చించేందుకు సమయం కేటాయించని వైసీపీ పార్టీ ప్రతిపక్ష పార్టీగా ఫెయిల్ అయ్యిందని టీడీపీ పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజిని తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ వైసీపీ నాయకులు బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ అనే పేరుతో ఆడుతున్న డ్రామాలు ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ఐదు సంవత్సరాలు రాష్ట్రాన్ని అభివృద్ధి అనేదే లేకుండా చేసిన దుర్మార్గపు పాలన జగన్మోహన్‌రెడ్డిది అన్నారు. బాపట్ల మాజీ ఎమ్మెల్యే రఘుపతి చేస్తున్న చీప్ పాలిటిక్స్ హాస్యాస్పదంగా ఉన్నాయని, 10 సంవత్సరాలు ఎమ్మెల్యేగా ఎవరు ఏమి చేసారో అందరికీ తెలుసు అన్నారు. తమ రాజకీయ మనగడ కోసం వైసీపీ నాయకులు చేస్తున్న డ్రామాలు ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. నాయకులపై బురద జల్లాలి అనుకుంటే రాబోయే ఎన్నికల్లో డిపాజిట్లు కూడా రావన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

ఎస్సై వెంకటేశ్వర్లు నాయక్

విశాలాంధ్ర-సిఎస్‌పురం : టూ వీలర్,ఫోర్ వీలర్ వాహనదారులు లైసెన్సు రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉండాలని స్థానిక ఎస్సై ఎం వెంకటేశ్వర్లు నాయక్ హెచ్చరించారు. మండల కేంద్రమైన సిఎస్పురంలోని పామూరు రోడ్‌లో శుక్రవారం ఎస్ఐ వెంకటేశ్వర్లు నాయక్ వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. శుక్రవారం జరిగిన స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మద్యం మత్తులో వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే చర్యలపై శిక్షలు తప్పవని స్పష్టం చేశారు. ప్రజల భద్రతే ముఖ్యమన్నారు టూవీలర్ వాహనదారులు పరిమితికి మించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ఈ సందర్భంగా ఆయన అన్నారు , ప్రతి ఒక్కరూ చట్టాలను గౌరవించి బాధ్యతా యుతంగా ప్రవర్తించాలని సూచించారు.మద్యం సేవించి వాహనం నడిపిన వారిపై జరిమానా విధించడంతో పాటు, అవసరమైతే జైలుశిక్షలు కూడా తప్పవని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై అన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన 'కదిరి'

విశాలాంధ్ర-సిఎస్‌పురం : జంగంవారిపల్లి గ్రామానికి చెందిన గెనుపుల శ్రీనివాసులు రెడ్డి కుమారుడు మహేష్ రెడ్డి వివాహ వేడుక గురువారం రాత్రి జరిగింది. ఈ వివాహ వేడుక లో కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కదిరి పార్థసారథి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దుగ్గిరెడ్డి జయరెడ్డి, జిల్లెళ్ళ బ్రదర్స్, గౌను నారాయణ రెడ్డి, మాజీ ఎంపిటిసి మూరం కాశిరెడ్డి,టీ బాబురావు, నున్నా నారాయణ,రాజశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అయ్యంబొట్లపల్లికి విద్యుత్ లైన్‌మెన్‌ను నియమించాలి

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : యర్రగొండపాలెం మండలంలోని అయ్యంబొట్లపల్లి గ్రామంలో గత ఐదు సంవత్సరాల నుంచి విద్యుత్ లైన్మెన్ లేక సమస్యలతో ఇబ్బందులకు గురవుతున్నామని గ్రామస్థులు వాపోతు న్నారు. ఎన్నిసార్లు పై అధికారులకు లైన్‌మెన్‌ను మా గ్రామానికి నియమించాలని అడిగినా పట్టీపట్టనటుగా వ్యవహారిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ట్రాన్స్మార్ కాలిపోవడంతో సాయంత్రం 8 గంటలనుండి మరుసటి రోజు ఉదయం 10 గంటల వరకు కరెంటు లేక గ్రామస్థులం చాలా ఇబ్బందులకు గురయ్యామని విమర్శలు గుప్పిస్తున్నారు. అదే గ్రామానికి లైన్మెన్ ఉండుంటే ఇలాంటి సమస్యలు వచ్చేవి కావని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లైన్మెన్ గ్రామానికి రాకుండా ఒక బిల్ కలెక్టర్, కరెంట్ కాంట్రాక్టర్ అడ్డు పడుతున్నారని విమర్శలు గుప్పిస్తున్నారు. ఇలాంటి పరిస్థితులకు మద్దతు పలుకుతున్న విద్యుత్ శాఖ ఏఈ అల్లూరయ్యపై జిల్లా విద్యుత్ ఎస్ ఇ కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. తక్షణమే మా గ్రామానికి లైన్మెన్ ను నియమించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై మార్కాపురం డిఇ స్పందించి గ్రామానికి లైన్‌మెన్‌ను తక్షణమే నియమిస్తామని ఆయన తెలిపారు.

వివాహ వేడుకల్లో ఆదిమూలపు సురేష్

విశాలాంధ్ర - సింగరాయకొండ : సింగరాయకొండ మండలం వైస్సార్సీపీ సీనియర్ నాయకులు పిట్టా బ్రహ్మయ్య కుమార్తె వెంకట మౌనిక సాయి వివాహ మహోత్సవ కార్యక్రమం సింగరాయకొండ మండల సోమరాజుపల్లి గ్రామంలో వారి ఇంటికి మాజీ మంత్రివర్యులు,పి.ఏ.సి సభ్యులు,కొండేపి నియోజకవర్గం వైస్సార్సీపీ ఇంచార్జ్ డా.ఆదిమూలపు సురేష్ శుక్రవారం హాజరై వారిని ఆశీర్వదించడం జరిగింది.ఈ కార్యక్రమంలో డా. అశోక్ కుమార్ రెడ్డి, యన్నాబత్తిన చిన్నా, సామాంతుల రవికుమార్ రెడ్డి, మసనం వెంకటరావు, చుక్కా కిరణ్ మరియు సింగరాయకొండ మండల వైస్సార్సీపీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఘనంగా మోదుకూరి జాన్సన్ జయంతి

విశాలాంధ్ర -ఒంగోలు : సినీ అభ్యుదయ రచయిత, అగ్ని కవి, మోదుకూరి జాన్సన్ 89వ జయంతి కార్యక్రమం శుక్రవారం ఒంగోలులోనే మంచి పుస్తకం షాపు దగ్గర ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరిగింది. ముందుగా జాన్సన్ కి ప్రజాసంఘాల నాయకులు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి చావలి సుధాకర్రావు ఓపిడిఆర్ రాష్ట్ర అధ్యక్షులుఅధ్యక్షత వహించి కులాల ఆదిపత్యంతో నిండి ఉన్న సినీ రంగంలో అట్టడుగు వర్గాల నుంచి వచ్చిన మోదుకూరి జాన్సన్ తనకంటూ ఒక ముద్ర వేశారని మంచి నాటకాలకు సినిమాలకు మాటలు పాటల రచయితగా అగ్ని కవిగా పేరు పొందారని అన్నారు. ముఖ్య వక్తగా సోషల్ డెమొక్రటిక్ ఫోరం కన్వీనర్ రచయిత కత్తి కళ్యాణ్ మాట్లాడుతూ అంటరానితనం ఆటుపోట్లను ఎదుర్కొని న్యాయవాదిగా వృత్తిని ప్రారంభించి నాటక రంగంలోకి ముందుగా ప్రవేశించారన్నారు. ముఖ్యంగా నటనలయం నాటకం ఆంధ్ర రాష్ట్రంలో ఒక ఊపు ఊపిందని. అన్నారు. వంద పైగా సూపర్ హిట్ సినిమాలకు సంభాషణలు మాటా పాటలు రాసిన అభ్యుదయ రచయితని అన్నారు. సంభాషణలు కదా మాట పాటలు రాసి సామాజిక రుగ్మతులను చీల్చి చెండాడిన అగ్ని కవి మధుర జ్ఞాపకం మోదుకూరి జాన్సన్ అని అన్నారు. ఆయన స్ఫూర్తిని నేటి రచయితలు కళాకారులు తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) రెడ్ జిల్లా కార్యదర్శి భీమవరపు సుబ్బారావు, రంగ భూమి కళాకారుల సమాఖ్య నాయకులు బాబు, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ పేరయ్య, ఐఎల్పి రాష్ట్ర అధ్యక్షులు దాసరి సుందరం, ఏఐపిఎస్పి జిల్లా అధ్యక్షులు టి వెంకట స్వామి, అభ్యుదయ రచయిత రెబ్బవరపు ఉదయ్, సర్పంచుల సంఘం మాజీ నాయకులు వీరభద్రాచారి, మాదిగ హక్కుల సంఘం నాయకులు ధనరాజు పల్లి ఆంజనేయులు, కార్మిక నాయకులు వీ శివరావు, ఓపిడిఆర్ జిల్లా కార్యదర్శి ఏఎల్ ప్రసాద్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కోర్టు వాయిదాలకు రాకుంటే చర్యలు ఎస్సై మహేంద్ర

విశాలాంధ్ర - సింగరాయకొండ : కోర్టు వాయిదాలకు రాకుండా తప్పించుకొని తిరుగుతున్న రౌడీ షీటర్ తన్నీరు శివ మహేష్‌ను వారంటుపై అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్సై బి.మహేంద్ర. మాట్లాడుతూ ఎవరిపైనా కోర్టు కేసులు ఉంటే తప్పనిసరిగా వాయిదాలకు హజరుకావాలి. లేని యెడల జైలుకు పంపడం జరుగుతుంది హెచ్చరించారు.

మద్యం తాగిన వ్యక్తికి రూ.1000 జరిమానా

విశాలాంధ్ర-కొమరోలు : మండలంలో బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగిన ఓ వ్యక్తికి గిద్దలూరు కోర్టు గురువారం రూ. 1,000 జరిమానా విధించారు. ఎస్ఐ నాగరాజు బహిరంగ ప్రదేశంలో మద్యం తాగుతున్న వ్యక్తిని గుర్తించి కేసు నమోదు చేశారు. కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి భరత్ చంద్ర విచారణ అనంతరం జరిమానా విధించినట్లుగా ఎస్ఐ నాగరాజు తెలిపారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ నాగరాజు హెచ్చరించారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

విశాలాంధ్ర-చీమకుర్తి : చీమకుర్తి మండలం పరిధిలోని పి.నాయుడుపాలెం పాటిమీద పాలెం,బండ్లమూడి,టీ. గుడిపాడు,వై.గుడిపాడు, పల్లామల్లి,గాడిపత్తి వారి పాలెం మరియు మంచికలపాడు గ్రామాలకు చెందిన గృహ,గృహేతర మరియు పారిశ్రామిక వినియోగదారులకు విద్యుత్ సరఫరా లో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు అంతరాయం కలుగుతుందని కావున వినియోగదారులు సహకరించగలరని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి. చంద్రశేఖరరావు ఒక ప్రకటనలో తెలియజేశారు.

వైభవంగా వరలక్ష్మీ వ్రతం

విశాలాంధ్ర-అర్ధవీడు : అర్ధవీడు మండలంలోని అర్ధవీడు స్థానిక కోదండ రామస్వామి దేవస్థానం నందు శుక్రవారం ఉదయం 10 గంటలకు నుండి సామూహిక వరలక్ష్మీ వ్రతము మరియు సీతా దేవి, సరస్వతి దేవి, వాసవి కన్యకాపరమేశ్వరి దేవి అమ్మవార్లకు వడి బియ్యం కార్యక్రమాన్ని వైభవంగా జరిగింది. వరలక్ష్మీ వ్రతం అనగా శ్రావణమాసంలో పౌర్ణమికి ముందు వచ్చె శుక్రవారాన్ని, శ్రావణ శుక్రవారమని, వరలక్ష్మీ వ్రతమని పిలుచుకుంటాము. ఈ వ్రతాన్ని ముత్తయిదులు అందరు అత్యంత భక్తి శ్రద్ధలతో ఆచరించే వ్రతం. ఈ వరలక్ష్మీ వ్రతం. వరాలు ఇచ్చే తల్లి కనుకనే ఈమెను "వరలక్ష్మీ దేవి" గా పూజిస్తాము. ఈ వ్రతం భవిషోత్తర పురాణమందు పార్వతీదేవికి పరమేశ్వరుడు వివరించి చెప్పిన వ్రత కథ ఇది. ఈ వరలక్ష్మీ వ్రతంలో మహిళలు అమ్మవారి తీర్థ ప్రసాదములు స్వీకరించారు. స్త్రీలు ఎంతో భక్తి శ్రద్ధలతో సౌభాగ్యం మరియు మాంగళ్యబలం పదిలంగా వుండాలని సిరిసంపదలు, సంతానాభివృద్ధి కలిగి ధన దాన్యలతో సుఖ సౌఖ్యాలు కలగాలని మహిళలు పూజలు నిర్వహించారు.

పేకాట రాయుళ్లు అరెస్ట్

విశాలాంధ్ర-వెలిగండ్ల : శుక్రవారం మండలంలోని కంకణంపాడు గ్రామ పొలాలలో పేకాట ఆడుతున్న ఏడుగురిని చాకచక్యంగా రెక్కీ నిర్వహించి ఎస్ఐ కృపా పావని పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకొని వారి వద్ద 5510 రూపాయలు పట్టుకున్నారు స్వాధీన పరుచుకున్నట్లు ఆమె తెలిపారు . కానిస్టేబుల్ పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

విశాలాంధ్ర-పామూరు రూరల్ : కనిగిరి నియోజకవర్గం పెదచెర్లోపల్లి మండలం చెరుకూరి వారి పల్లెలో ఏర్పాటు చేసిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపక టీడీపీ జెండాను శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పామూరు మండల టిడిపి అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్దన్ రావు,కనిగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ యారవ రమా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు వేదికగా చారిత్రాత్మక ఘట్టం

విశాలాంధ్ర – కనిగిరి : ఎరుపు జెండా రెపరెపలతో దేశమంతా ఉద్యమ సంచలనం సృష్టించిన కమ్యూనిస్టు ఉద్యమానికి ఇది ఓ మైలురాయి. వందేళ్ల పోరాట ప్రస్థానానికి సాక్ష్యంగా ప్రజల దుఃఖాన్ని తనదిగా భావించిన ఉద్యమ చైతన్యానికి పునాది వేసిన భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శతాబ్ది ఉత్సవాల అనంతరం మొట్టమొదటిసారిగా రాష్ట్ర మహాసభలను ప్రకాశం జిల్లాలో నిర్వహించబోతోంది. ఈ చారిత్రాత్మక సభలకు వేదికగా ఒంగోలు పట్టణం గర్వంగా నిలుస్తోంది. పార్టీ ఆవిర్భావానికి నాంది పలికిన 1925 నాటి నుంచి, ప్రజల సమస్యలే తన సమస్యలుగా భావించి, వ్యవస్థల మార్పు కోసం నిరంతర పోరాటం చేసిన సిపిఐ... ఇప్పుడిప్పుడే వందేళ్ళు పూర్తిచేసుకుంటూ, 21వ శతాబ్దపు సవాళ్లను ఎదుర్కొనే కొత్త వ్యూహాలపై చర్చించడానికి సిద్ధమవుతోంది.

ఆంధ్రప్రదేశ్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) నిర్మాణం :-

1925 డిసెంబర్ 26 న ఉత్తరప్రదేశ్ లోని కాన్పూర్ లో మొట్టమొదటి భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ప్రారంభ సభను నిర్వహించారు. ఆ తర్వాత అంచలంచెలుగా విస్తరిస్తూ ఆంధ్రాలో కమ్యూనిస్టు పార్టీ పుట్టినిల్లు అయిన కృష్ణాజిల్లాకు విస్తరించింది. అప్పటి బెజవాడ కేంద్ర స్థానంగా (విజయవాడ) చేసుకొని చండ్ర రాజేశ్వరరావు, చలసాని జగన్నాథ రావు, ఉద్దరాజు రామం, తక్కెళ్ళ చలపతి, పుచ్చలపల్లి సుందరయ్య, కొసరాజు శేషయ్య, గారపాటి సత్యం నారాయణ, అల్లూరి సత్యనారాయణ రాజు, మద్దుకూరి చంద్రశేఖర రావు, పోలుపెద్ది నరసింహామూర్తి, చలసాని వాసుదేవరావు, ఇలా ఎందరో ఆనాడు కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై ఆంధ్రాలో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) స్థాపనకు కృషి చేశారు. బెజవాడ (విజయవాడ) లోని కాట్రగడ్డ సత్యనారాయణ తోటలో 1934 సెప్టెంబర్ లో పుచ్చలపల్లి సుందరయ్య కార్యదర్శిగా అల్లూరి సత్యనారాయణ రాజు, చలసాని వాసుదేవరావు, తక్కెళ్ళ చలపతి, శేషయ్య, చంద్రశేఖర్, నరసింహామూర్తి సభ్యులుగా చేసుకొని ఒక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశమే రాష్ట్రంలో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) పార్టీ నిర్మాణానికి బీజమైంది. ఆనాటి నుంచి ఈనాటి వరకు ఆంధ్రప్రదేశ్లో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) కి 90 ఏళ్ల చరిత్ర కలిగి ఉంది.

ప్రకాశం జిల్లా ప్రాధాన్యత :-

చీరాల పేరాల ఉద్యమం నుంచి ప్రారంభమై, నక్సల్బరీ స్ఫూర్తితో జ్వలించిన గ్రామీణ బహుజన ఉద్యమాలకు వేదికగా నిలిచిన ప్రకాశం జిల్లా పూల సుబ్బయ్య, గుజ్జుల యల్లమందారెడ్డి, కాకుమాను వెంకటేశ్వర్లు, దరిశి చెంచయ్య ఇలా ఎందరో కమ్యూనిస్టుల ఎన్నో సామూహిక పోరాటాలకు సాక్షిగా నిలిచింది. ప్రత్యేకించి ఒంగోలు రాజకీయ చైతన్యానికి నిలయం.

ఇలాంటి ప్రగతిశీల ప్రాంతంలో మహాసభలు జరగడం విశేషం. దీన్ని ఒంగోలు ప్రజలకి మాత్రమే కాక రాష్ట్రంలోని శ్రామిక రైతు ఉద్యమాలకు దిశానిర్దేశం చేసే ఘట్టంగా పార్టీ భావిస్తోంది.

20 నుంచి 25 వరకు మహాసభలు – రాష్ట్రానికి కొత్త దిక్సూచి :-

ఆగస్టు 20 నుంచి 25 వరకు నిర్వహించబోయే ఈ ఆరు రోజుల మహాసభల్లో రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది ప్రతినిధులు, పార్టీ నేతలు, ప్రజా సంఘాల కార్యకర్తలు పాల్గొననున్నారు. ఈ మహాసభల్లో ప్రధానంగా చర్చకు వచ్చే అంశాలు ఇలా ఉండే అవకాశం ఉంది.

కనిగిరిలో కదం తొక్కిన కమ్యూనిస్టులు

సిపిఐ రాష్ట్ర మహాసభలు ఒంగోలులో నిర్వహిస్తున్న సందర్భంగా కనిగిరి నియోజకవర్గంలోని భారత కమ్యూనిస్టు పార్టీ నాయకులు ఎర్రజెండాను భుజానికి ఎత్తుకొని ఊరు ఊరు వాడ వాడ తిరుగుతూ రాష్ట్ర మహాసభల కరపత్రాలను ఇంటింటికి పంచుతూ సిపిఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతున్నారు. సిపిఐ పార్టీ జిల్లా నాయకులు వై రవీంద్రబాబు, సయ్యద్ యాసిన్ లు మాట్లాడుతూ ప్రజల సమస్యల పట్ల నిబద్ధతతో యువతలో చైతన్యం పెంపొందించే దిశగా ఈ మహాసభలు కీలక మైలురాయి అవుతాయి. ప్రకాశం జిల్లా ఎంపిక సామాజిక న్యాయ సంకల్పానికి అద్దం పడుతుంది అని తెలిపారు.

ఒంగోలు ఏర్పాట్లతో సందడిగా మారుతోంది :

మహాసభల నిర్వహణకు పార్టీ అభిమానులు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో పార్టీ వారిలో ఉత్సాహం కనిపిస్తోంది. వేదిక, వసతి, భద్రత, వాహన సౌకర్యాల ఏర్పాట్లు పూర్తవుతున్నాయి. ఇది ఒంగోలు ప్రజలు గర్వించదగ్గ విషయం. కమ్యూనిస్టు ఉద్యమం మళ్లీ పునర్జీవితం కావాల్సిన అవసరం ఉన్న ఈ సమయంలో, మన పట్టణం చరిత్రలో గుర్తుండిపోయే వేదిక అవుతుందని జిల్లా కార్యదర్శి యంఎల్ నారాయణతో పాటు జిల్లా కమ్యూనిస్ట్ పార్టీ నాయకులు అన్నారు.

విశ్వాసంతో కూడిన సంకల్పం – భవిష్యత్ పోరాటాలకు కొత్త శక్తి :

ఈ మహాసభలు ఎరుపు జెండా కింద నడిచే నిరంతర ప్రజా పోరాటాలకు నూతన దిశను నిర్దేశించనున్నాయి. ఎరుపు రంగు త్యాగానికి సంకేతం, సుత్తి కార్మిక భవిష్యత్తుకు మార్గదర్శనం, కొడవలి శ్రమజీవుల శక్తికి రూపకం. ఈ మహాసభలు ప్రజాస్వామ్యానికి పునఃప్రాణం పోసే శక్తిగా, సమాజ మార్పుకు మేలుకొలుపుగా నిలవనున్నాయి. ఒంగోలు మట్టిలో నుంచి మరోసారి చైతన్య రేఖలు బయలుదేరుతున్నాయి – ఇది కేవలం సభ మాత్రమే కాదు... వందేళ్ల ఉద్యమ వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించే గంభీర పర్యాయం. ఈ సిపిఐ రాష్ట్ర మహాసభలకు కనిగిరి నియోజకవర్గం అలాగే జిల్లా నలుమూలల నుంచి కార్మిక, కర్షక, శ్రామిక వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై ఈ మహాసభలను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా నాయకులు వై రవీంద్రబాబు, సయ్యద్ యాసీన్‌లతో పాటు సిపిఐ కనిగిరి నియోజకవర్గం సమితి సభ్యులు కోరుతున్నారు.

గిరిజనుల హామీలను నెరవేర్చాలి

విశాలాంధ్ర–చిలకలూ రిపేట: గిరిజనులకు ఇచ్చిన హామీలను అమ లు పరచటంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు బి శ్రీనునాయక్ విమర్శించారు. పట్టణంలోని ఎన్‌ఆర్‌టీ సెంటర్‌లో ఉన్న సంఘ కార్యాలయంలో శు క్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అందరి కంటే అన్ని విధాలుగా దోపిడీకి గురి అవుతున్నది గిరిజనులేనని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య,వైద్యం, ఉపాధి, ఆర్థిక అసమానతల గురించి అవగాహన లేక గిరిజన ప్రజలు వెనుకబడి పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారినా గిరిజన ప్రజల తలరాతలు మారడం లేదన్నారు. సమాజంలో అందరితో పాటు మనుగడ సాగించే హక్కు వంటి కల్పించాలని తీర్మానం చేసిందన్నారు. గిరిజన హక్కుల కోసం అనేక మంది నాయకులు చేసిన పోరాట ఫలితంగా 1993 ఆగస్టు 9న గిరిజన దినోత్స వం జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో శనివారం సీపీఐ కార్యాలయ భవనంలో నిర్వహిస్తున్న గిరిజన దినోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేతన్న హామీలు అమలు: అబద్దయ్య

విశాలాంధ్ర–మంగళగిరి : ఎన్నికల ప్రచారంలో నేతన్నలకు ఇచ్చిన హామీ లను శరవేగంగా అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కు తుందని రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం మంగళగిరి లోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మాట్లా డారు. ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వం లోని కూటమి ప్రభుత్వం చేనేత రంగానికి నూతన దిశ చూపేందుకు నిరంతరం కృషి చేస్తోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో పూర్తిగా నిర్లక్ష్యం పాలైన నేతన్నల జీవితాల్లో ఇప్పుడు వెలుగులు విరజిమ్ముతున్నాయని నేత న్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో వ్యవసా య రంగానంతర రంగా అత్యధిక ప్రజలు ఆధారపడిన రంగంగా చేనేత నిలిచింది. గత ప్రభుత్వ హయాంలో చేనే తలకు ప్రోత్సాహం కరువవ్వడంతో పాటు ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కూడా లభించ లేదు. మంత్రి లోకేష్ 'యువగళం' పాదయాత్రలో చేనేత కుటుంబాల సమస్యలను ప్రత్యక్షంగా చూశారని, అందుకే వారికి నిత్య ఆదర ణగా నిలిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసు కుంటోందని చెప్పారు. రాజధాని అమరావతిలో చేనేత వారసత్వాన్ని ప్రదర్శించేందుకు హ్యాండ్లూమ్ మ్యూజియం నిర్మాణానికి నిర్ణయం తీసుకు న్నారన్నారు. 11వ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో ప్రారంభించిన పథకాలు చేనేత కుటుంబాల్లో ఆనందం నింపాయన్నారు. చేనేతలకు 200 యూనిట్లు, పవర్ లూమ్‌లకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్తు అమ లులోకి తెచ్చారన్నారు. చేనేత వస్త్రాలపై 5 శాతం జీఎస్టీ మినహాయింపునకు, ఏడాదికి రూ.15 కోట్లు చెల్లించ నున్నారు. నేతన్నలను వ్యాపారవేత్త లుగా తీర్చిదిద్దే ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించారని వెల్లడించారు.

కంటి వైద్యుడు నల్లమోతు మృతి

విశాలాంధ్ర–చిలకలూరిపేట: సీనియర్ కంటి వైద్యుడు, రాయుడు కంటి ఆసుపత్రి అధినేత డాక్టర్ నల్లమోతు ప్రసాదరావు(75) అనారోగ్యంతో శుక్రవారం కన్ను మూశారు. కొన్ని రోజుల కిందట అనారోగ్యానికి గురికాగా గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స తీసు కుంటూ అక్కడే తుది శ్వాస విడిచారు. పట్టణంలోని సుబ్బయ్యతోటలో రాయుడు కంటి ఆసుపత్రి స్థాపించి గత నాలుగు దశాబ్దాలుగా మంచి హస్తవాసిగల కంటి వైద్యు డిగా గుర్తింపు పొందారు. ఆయనకు భార్య ఆదిశేషమ్మ, మురళీచంద్, రతన్ కిషోర్, రఘువీర్‌లు ఉన్నారు. ఆయన మృతి వార్త తెలుసు కున్న డాక్టర్లు, ఐఎంఏ సభ్యులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

డ్రోన్ పర్యవేక్షణలో పంగులూరు మండలం

విశాలాంధ్ర - జె.పంగులూరు : మండల పరిధిలోని గ్రామాలు,జాతీయ రహదారి 16 డ్రోన్ పర్యవేక్షణలో ఉన్నాయని జె.పంగులూరు ఎస్సై వినోద్ బాబు తెలిపారు.శుక్రవారం డ్రోన్ ద్వారా జాతీయ రహదారి 16 అలాగే పొంగులూరు స్టేషన్ పరిధిలోని గ్రామాలను పర్యవేక్షణ చేయడం జరిగిందని డ్రోన్ ద్వారా అసాంఘిక కార్యకలాపాలను,నేరాలను,రోడ్డు ప్రమాదాలను సులభంగా వెంటనే పసిగట్టవచ్చని తద్వారా మండల పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు,దొంగతనాలు,అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవచ్చని ఎస్సై వినోద్‌బాబు తెలిపారు. గ్రామాల్లోని శివారు ప్రాంతాలు అన్నీ డ్రోన్ పర్యవేక్షణలో ఉన్నాయని ప్రజలు గుర్తించాలని తెలిపారు.పర్యవేక్షణలో ప్రతి ఏరియాను క్షుణ్ణంగా పరిశీలించడం జరుగుతుందని తెలిపారు.

వైభవంగా సాగర హారతి

విశాలాంధ్ర - చీరాల రూరల్ : శ్రావణ మాసం పౌర్ణమి సందర్భంగా మండలంలోని వాడ రేవు గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న శ్రీఆంజనేయ స్వామి విగ్రహం వద్ద హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో సాగర హారతి కార్యక్రమం వైభవంగా నిర్వహించారు.శివయ్య స్ఫటిక లింగానికి వివిధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు.భజనల అనంతరం సముద్రునికి సాగర హారతి సమర్పించారు.అధిక సంఖ్యలో హాజరైన మహిళలతో రక్షా బంధన్ కార్యక్రమం నిర్వహించారు.భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు అందించారు.ఈ కార్యక్రమంలో తాడివలస దేవరాజు,నగేష్ కుమార్,శబరి, అమర్ నాథ్,భక్తులు,అధిక సంఖ్యలో మహిళలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఆటల పోటీలకు వేటపాలెం విద్యార్థినులు

విశాలాంధ్ర - వేటపాలెం : హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్ జయంతి ("నేషనల్ స్పోర్ట్స్ డే") సందర్భంగా గురువారం బాపట్లలో రాష్ట్రస్థాయి ఆటల పోటీలకు ఎంపికలు జరిగాయి.వేటపాలెం గర్ల్స్ హైస్కూల్‌కు చెందిన కె. గాయత్రి, పి.బిందు వాలీబాల్ విభాగంలో, షేక్ నస్రిన్, ఎల్. వైష్ణవి కబడ్డీ విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వారు ఈనెల 11 నుండి 14 వరకు గుంటూరు నందు జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో బాపట్ల జిల్లా తరపున పాల్గొంటారు. వ్యాయామ ఉపాధ్యాయులు జడ దేవబిక్షం, జరుబుల శ్రావణిలకు, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినీలకు ప్రధానోపాధ్యాయులు దేవరకొండ సరోజిని, ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

శాంతి, భద్రతలకు వైసీపీ విఘాతం

☞ భూమన అనుచరుడు దళిత యువకుడిపై దాడి హేయం

☞ బాపుడా చైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు

విశాలాంధ్ర - బాపట్ల : రాష్ట్రంలో వైసీపీ నేతలు శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తుందని బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ సలగల రాజశేఖర్ బాబు తెలిపారు. సలగల ఆయన కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కలియుగ వెంకటేశ్వర స్వామి కొలువైన పవిత్ర తిరుమల తిరుపతిలో భూమన కరుణాకర్ రెడ్డి కుటుంబం ఆధ్వర్యంలో వైసీపీ అనుచరుడు దళిత యువకుడిపై చేసిన దాడిని ఖండిస్తున్నామన్నారు. ఈ దాడి కేవలం వ్యక్తిపై జరిగిన దౌర్జన్యం మాత్రమే కాదని దళిత సమాజంపై వైసీపీ నాయకత్వం చూపిస్తున్న దమనకాండకు నిదర్శనమన్నారు. వైసీపీ నాయకుడు భూమన కరుణాకర్ రెడ్డి కుమారుడు అభినయ రెడ్డి కార్యాలయంలో వైసిపి రౌడీలు దళిత యువకుడిని బంధించి స్పృహ కోల్పోయే విధంగా క్రూరంగా దాడి చేశారని దారుణ ఘటనను వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తూ బాధితులను భయపెడుతున్నారని మండిపడ్డారు. దారుణమైన ఘటన పవిత్రమైన పుణ్యక్షేత్రం తిరుపతిని అపవిత్రం చేయటమే కాకుండా రౌడీయిజంతో సమాజంలో భయాందోళనలో సృష్టించటానికి స్పష్టమైన ఆధారమన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో అల్లర్లు సృష్టించే వారిపై ఉక్కుపాదం మోపనున్నారని తెలిపారు. వైసీపీకి 11 సీట్లు ఇచ్చినా కూడా బుద్ధి మారలేదన్నారు. భవిష్యత్తులో వైసీపీ ఆ సీట్లు కూడా రావని జోస్యం చెప్పారు.

గిరిజన బాలికపై దాడి

❑ మహిళల ముందు బహిరంగ మూత్ర విసర్జన

❑ అడిగినందుకు కర్రలు, వైర్లతో దాడి

విశాలాంధ్ర - కొరిశపాడు : మండలంలోని మేదరమెట్ల బస్టాండ్ వద్ద గిరిజన వర్గానికి చెందిన ఓ కుటుంబంపై దాడి ఘటన ఆలస్యంగా విలువలోకి వచ్చింది.యానాది సామాజిక వర్గానికి చెందిన కుటుంబం స్థానిక బస్టాండ్ వద్ద వాష్‌రూమ్‌ల శుభ్రత పనుల్లో నిమగ్నమై అక్కడే ఉంటారు.ఈ క్రమంలో మేదరమెట్లకు చెందిన గోలి అజయ్ అనే వ్యక్తి వారి ముందుకు వచ్చి వారివద్దే నిలబడి మూత్ర విసర్జన చేశాడు.ఇది తప్పు అని కుటుంబ సభ్యులు ప్రశ్నించగా సామాజికంగా కుల దూషణ చేస్తూ అవమానించాడు.మీరు ఎంత మీ సామాజిక వర్గం ఎంత అంటూ దూషించడమే కాకుండా వెంటనే తనకు అంది వచ్చినా కర్రలు,విద్యుత్ వైర్లు తీసుకుని ప్రశ్నించిన గిరిజన కుటుంబంపై విరుచుకు పడ్డాడు.ఈ ఘటనలో అభం శుభం తెలియని 16 ఏళ్ల బాలిక భువనేశ్వరినీ విచక్షణారహితంగా కొట్టి గాయపరిచాడు.గిరిజన బాలికను చెప్పు కోలేని ప్రదేశంలో కాలుతో తన్నడమే కాకుండా వారు నివాసముండే గిరిజన కాలనీలోకి కూడా వెళ్లి బెదిరించాడు.బాధిత బాలిక వైద్యం కోసం ఒంగోలు ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స కోసం వెళ్లారు.రాష్ట్ర ఏరుకుల హక్కుల సంఘం అధ్యక్షుడు ఆదినారాయణ మేదరమెట్ల పోలీస్ స్టేషన్‌ను చేరుకొని బాధితుల తరపున ఫిర్యాదు చేశారు.దుండగుడిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై జిల్లా కలెక్టర్, ఎస్పీ స్పందించాలని పిలుపునిచ్చారు. మూడు రోజుల క్రితం జరిగిన సంఘటనపై దళిత సంఘాల ఆందోళనతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు.ఈ దాడి ఘటనపై దళిత సంఘాలు తీవ్ర స్థాయిలో స్పందిస్తున్నాయి.

ప్రజా దర్బార్‌కు 170 అర్జీలు

విశాలాంధ్ర - చీరాల రూరల్ : చీరాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య ఆదేశానుసారం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ప్రజల నుండి అర్జీలు స్వీకరించి సంబంధిత విభాగాలకు పంపించి త్వరగతిన పరిష్కరిస్తామన్నారు.170 అర్జీలు రాగా పెన్షన్ కోసం 45 అర్జీలు,ఇళ్ల స్థలాల కోసం 110 అర్జీలు,ఇతర సమస్యలపై 15 అర్జీలు వచ్చాయి.ఈ కార్యక్రమంలో చీరాల మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు,తెదేపా మండల అధ్యక్షులు గంజి పురుషోత్తం,జంగిలి రాముడు, కారంపూడి పద్మిని తదితరులు పాల్గొన్నారు.

యువ ఆంధ్ర ప్రో కబడ్డీ రిఫరీగా శ్రావణి

విశాలాంధ్ర - వేటపాలెం : జిల్లా పరిషత్ హైస్కూల్లో వ్యాయామ ఉపాధ్యాయనిగా పనిచేస్తున్న జరుబుల శ్రావణి యువ ఆంధ్ర ప్రో కబడ్డీ సీజన్ -1 కు రిఫరీగా ఎంపికయ్యారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా 'క్రీడా ఆణిముత్యం' కబడ్డీలో 30 నేషనల్ ఆడి ప్రకాశం జిల్లా కీర్తి ప్రతిష్టలు నిలబెట్టిన శ్రావణి ఆగస్టు 15 నుండి 25వ తేదీ వరకు జరుగు యువ ఆంధ్ర ప్రో కబడ్డీ సీజన్ - 1కు ఆంధ్ర కబడ్డీ రెఫరీస్ బోర్డు నుండి ఎంపికైనట్లు ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ యలమంచిలి శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ నాకు ఈ అవకాశం ఇచ్చిన ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ రిఫరీస్ బోర్డు చైర్మన్ బి.మురళికుమార్, కన్వీనర్ పి.రవీంద్ర బాబు, ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసి యేషన్ ప్రెసిడెంట్ కుర్ర భాస్కర్‌రావు, సెక్రటరీ వై. పూర్ణచంద్రరావుకి ధన్యవాదాలు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవరకొండ సరోజిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు శ్రావణిని అభినందించారు.

నేటి నుంచి అంతర్ జిల్లాల అథ్లెటిక్స్ పోటీలు

విశాలాంధ్ర - చీరాల టౌన్ : చీరాల విఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాల వేదికగా శనివారం నుండి మూడు రోజులపాటు 36వ అంతర్ జిల్లాల అథ్లెటిక్స్ సెలక్షన్ పోటీలు జరగనున్నాయని బాపట్ల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ వెంకట్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సెలక్షన్‌కు సంబంధించిన అన్ని ఏర్పాట్లను క్రీడా మైనదానంలో పూర్తి చేశారు. ఎమ్మెల్యే మాలకొండయ్య సహకారంతో నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు భోజన వసతి, క్రీడా సామగ్రి అందించేందుకు మద్దులూరి మహేంద్ర ముందుకొచ్చి సహకారం అందించారని తెలియజేశారు. సుమారు 2000 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొననున్నారని అంతర్జాతీయ స్థాయిలో క్రీడలలో రాణించేందుకు ఇటువంటి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అసోసియేషన్ ప్రతినిధులు స్వామిరెడ్డి, అరుణకుమార్, అనంతపూర్, గోపి, రాజు టీడీపీ నిర్వహణ నాయకులు మరక చంద్ర,పులి హరికృష్ణ, గొర్ల నరేంద్ర,బాలాజీ, తేజ,తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణ మంటపం నిర్మాణానికి ఆర్థిక వితరణ

విశాలాంధ్ర - చీరాల రూరల్ : చీరాల ఎన్.ఆర్. అండ్.పీ.ఎం హైస్కూల్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాకింగ్ సభ్యుడు చక్కా చెన్న నారాయణ ఆర్థిక సహకారంతో స్థానిక ఎన్‌వీఎస్ అండ్ ఎస్‌జెఆర్ ఆర్య వైశ్య కళ్యాణ మండపం ప్రెసిడెంట్ చేబ్రోలు బాబాజీరావు,వైస్ ప్రెసిడెంట్ మద్దు వెంకట సుబ్బారావు సమక్షంలో కళ్యాణ మండపము పునర్ నిర్మాణానికి రూ.1,01,116 విరాళం ప్రకటించారు.మహాదేవ వేద గోశాలకి రూ.10,000లు విలువ గల ఐరన్ బీరువాను బహుకరించారు. అసోసియేషన్ తరపున గోవుల తవుడు నిమిత్తం రూ.1116లు అందించారు. ఈ కార్యక్రమంలో పోలు దాసు రామకృష్ణ, చారగుళ్ళ గురుప్రసాద్,నారాయణమూర్తి, తిరుపతిరావు, సుబ్బారావు, జనార్ధనరావు, మూర్తి,సురేష్, కళ్యాణ మండపం,గోశాల,గాయత్రి పరివార్ సభ్యులు పాల్గొన్నారు.